ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 294 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 20 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


## సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!

వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది.


## భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు.



## ఉగ్రవాదంపై చర్యలు తీసుకోవాలే కానీ, ఆజ్యం పోయకూడదు

- పోలండ్ ఉపప్రధానికి జైశంకర్ చురక
- గత ఏడాది పాకిస్థాన్ వెళ్లి కశ్మీర్‌పై ఉమ్మడి ప్రకటన చేసిన పోలండ్ ఉప ప్రధాని
- ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుందని జైశంకర్ విమర్శ
- ఉగ్రవాదంపై మెతక వైఖరిని విడనాడాలని పిలుపు



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- మరణించిన ఆరుగురు మావోయిస్టుల గుర్తింపు
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఈ నెల 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు కాల్పులు
- మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు

## తెలంగాణలో పురపోరుకు

# సర్వం సిద్ధం



- ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించే యోచనలో ఎలక్షన్ కమిషన్
- 7 నగరపాలక సంస్థలు, 116 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ జారీకి సిద్ధం
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో మున్సిపల్ పోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన దస్త్రం ఇవాళ ఎన్నికల సంఘానికి చేరనుంది

హైదరాబాద్

రాష్ట్రంలో పురపోరుకు సర్వం సిద్ధమైంది. 7 నగర పాలక సంస్థలు, 116 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ జారీకి ఈసీ సమాయత్తం అవుతోంది. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలకు సిద్ధమైన ఈసీ, ఈ ఎన్నికలను ఒకే విడతలో నిర్వహించే యోచనలో ఉంది. మున్సిపల్ ఎన్నికలకు మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో మున్సిపల్ పోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన దస్త్రం ఇవాళ ఎన్నికల సంఘానికి చేరనుంది. అందుకు అనుగుణంగా ఈసీ సమావేశమై షెడ్యూల్ విడుదల చేస్తుంది. ఇప్పటికే మహబూబ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, కొత్తగూడెం, రామగుండం, నల్గొండ, నిజామాబాద్ నగరపాలక - మిగతా3లో



# కవిత కొత్త పార్టీ

రంగంలోకి ప్రశాంత్ కిశోర్!

- కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత అడుగులు
- వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలు
- తెలంగాణ జాగృతిని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటన
- మైనార్టీలు, బీసీలు, యువతకు తన పార్టీలో చేరాలని ఆహ్వానం

హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక, తన రాజకీయ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రయత్నాలను ఆమె ముమ్మరం చేశారు. కేవలం ప్రకటనలకే - మిగతా3లో



## అధికారాన్ని బీజేపీ కేంద్రీకరిస్తున్నది

- దేశంలో అధికారాన్ని కేంద్రీకృతం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నం.. తమ పార్టీ వికేంద్రీకరణను విశ్వసిస్తుంది
- మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ 73, 74వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చింది
- రాజ్యాంగాన్ని పరిరక్షించడం అంటే గ్రామీణ స్థాయిలో పరిపాలనను వికేంద్రీకరించడం అవుతుంది
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు

## సుప్రీంకోర్టు నోటీసులు

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన ఏలేటి మహేశ్వరరెడ్డి
- మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు
- వచ్చే నెల 6కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



హైదరాబాద్

సుప్రీంకోర్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌పై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయలేదని పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను కౌశిక్ రెడ్డి, కేటీఆర్ పిటిషన్లతో జత చేసిన సుప్రీంకోర్టు అన్ని పిటిషన్లపై విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేసింది. తమ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి(గద్వాల), అరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), ఎం.సంజయ్(జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), కాలె యాదయ్య(చేవెళ్ల), తెల్లం వెంకట్రావు(భద్రాచలం), కడియం శ్రీహరి(స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్(ఖైరతాబాద్), ప్రకాశ్‌గౌడ్(రాజేంద్రనగర్)లు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, చింత - మిగతా3లో

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

- ఉదయం పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నబీన్
- జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో అనివార్యమైన ఎన్నిక
- గత ఏడాది డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం



## సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్




మేడారంలో గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పునఃప్రారంభించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను రేవంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు

# తప్పని నిరీక్షణ

- కొత్త కార్డుదారుల ఇళ్లల్లో 'గృహజ్యోతు'లు వెలిగేది ఎప్పుడో!
- పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న గృహజ్యోతి పథకం
- సద్వినియోగం చేసుకుంటున్న లబ్ధిదారులు
- పథకం వర్తింపునకు తమకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరుతున్న కొత్త రేషన్ కార్డుదారులు
- ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని అర్హులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారు నెలకు 200 యూనిట్ల విద్యుత్తు వినియోగించిన పక్షంలో వారికి జీరో కరెంట్ బిల్ వస్తుంది. 200 యూనిట్ల వినియోగం దాటిన పక్షంలో పూర్తి విద్యుత్ బిల్లును చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ ఒక కుటుంబానికి ఒక కనెక్షన్ మీటరుకు వర్తిస్తుంది. సొంత ఇల్లయినా, రెంట్ ఇంట్లో ఉంటున్నప్పటికి ఈ రాయితీని వినియోగించుకోవచ్చు. అయితే కొన్ని జిల్లాల్లో దరఖాస్తు చేసుకున్న కొంత మందికి ఈ పథకం ఇప్పటికీ వర్తించక పోవడంతో లబోదిబోమంటున్నారు. తమకూ - మిగతా3లో


## సంపాదకీయం

# శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ

ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.. ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంతమందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించి, జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు సరిహద్దు గాంధీ. ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాద కరమైన వ్యక్తి అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. 'నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు సరిహద్దు గాంధీ. బాద్షా ఖాన్ గా సరిహద్దు గాంధీ గా పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారమును పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఇతని అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. ఇతను పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారతదేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన పష్టున్ స్వాతంత్ర్య కార్యకర్త. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అతను మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు మరియు మిత్రుడు, అయన భారతదేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత అతను జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు'. 'వేలాది అహింసా పఠాన్‌ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉట్మాన్జైలోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్-ఇ ఇస్లా-ఇ ఆఫ్ఘనియా' (ఆఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), మరియు 1927 లో యువ ఉద్యమమైన 'పాక్తున్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత , అతను పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్తున్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం యొక్క లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం ద్వారా మాత్రమే అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది, అతను 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసుకున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. వారు స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నారు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వారించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని మరియు ఖుదై ఖిద్మత్గర్, మరియు నేను మాత్రమే సేవ చేయాలను కుంటున్నాను" అని చెప్పి గౌరవాన్ని తిరస్కరించారు. అతను చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడుతుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడమని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడటానికి ప్రతిజ్ఞ చేయమని ఒప్పించాడు. అతను ఈ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అతని "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సర్వర్లు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి ఒప్పించాడు. బ్రిటీష్ పాలన ముగిసిన తరువాత భారతదేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మంది శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా నిరంతరం కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాదనే అవసరమైన నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్లో పాఠశాలలను తెరిచాడు, మహిళలను సమాజంలో ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చాడు మరియు తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రతిజ్ఞ చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయనాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లింలీడర్లు, ఇతను ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు.మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశారు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు. 'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. చివరకు మీరు మమ్మల్ని నక్కల పాలు చేశారు' అని సీడబ్ల్యూసీను ఉద్దేశించి ఖాన్ వ్యాఖ్యానించాడట. సరిహద్దు ప్రాంతవాసులకు ద్వేషి అయ్యాడు, అటు దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ లు తీవ్రంగా ద్రోహం చేశాయని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు" అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది శాశ్వతంగా మిగిలిపోతుందని పిలుపునిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటూ పాకిస్థాన్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్గానిస్థాన్‌లోని కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చారు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచిపోయినట్లుగానే గాంధీని మరచిపోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి

# వాతావరణ మార్పుల అనుసరణకు నిధుల సంక్షోభం

## అభివృద్ధి చెందుతున్న దేశాలపై పెరుగుతున్న భారం




**ధర్మఘంట, జనవరి 18, హైదరాబాద్ :** వాతావరణ మార్పుల ప్రభావాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రతరం అవుతున్న వేళ, అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరణ చర్యల కోసం అవసరమైన ఆర్థిక వనరుల కొరతతో సతమతమవుతున్నాయి. వరదలు, కరవు, తీవ్ర తుపానులు, సముద్ర మట్టం పెరుగుదల వంటి ప్రకృతి విపత్తులు తరచూ సంభవించడంతో, ప్రజల జీవనోపాధులు మరియు మౌలిక సదుపాయాలు ప్రమాదంలో పడుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ తీవ్రమవుతున్న వేళ, అభివృద్ధి చెందుతున్న దేశాలు మరో పెద్ద సవాల్‌ను ఎదుర్కొంటున్నాయి. అదే వాతావరణ మార్పులకు తగినట్లుగా అనుసరించేందుకు అవసరమైన ఆర్థిక వనరుల కొరత, వాతావరణ మార్పుల ప్రభావం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందుతున్న దేశాలు వాతావరణ మార్పులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. "అడాప్టేషన్ గ్యాప్ రిపోర్ట్ 2025: రన్నింగ్ ఆన్ ఎంప్టీ" ప్రకారం, వాతావరణ అనుసరణకు అవసరమైన ఖర్చులు వేగంగా పెరుగుతుండగా, అంతర్జాతీయ ఆర్థిక సహాయం మాత్రం తీవ్రంగా తక్కువగానే కొనసాగుతోంది.

ఈ నివేదిక అంచనా ప్రకారం, 2035 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు వాతావరణ అనుసరణ కోసం ప్రతి సంవత్సరం సుమారు అమెరికన్ డాలర్లు 310 బిలియన్లు అవసరం అవుతుంది. అయితే, దేశాలు తమ జాతీయంగా నిర్ణయించిన వంతులు మరియు జాతీయ అనుసరణ ప్రణాళికలలో స్వయంగా పేర్కొన్న అవసరాల ఆధారంగా లెక్కిస్తే, ఈ మొత్తం ప్రతి సంవత్సరం 365 బిలియన్ డాలర్లకు పెరుగుతోంది.

దీనికి విరుద్ధంగా, 2023లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందిన అంతర్జాతీయ ప్రజా వాతావరణ అనుసరణ నిధులు కేవలం 26 బిలియన్ డాలర్లు మాత్రమే. ఇది 2022లోని 28 బిలియన్ డాలర్లతో పోలిస్తే తగ్గుదలగా నిలిచింది. అంటే, ప్రస్తుతం అందుతున్న నిధులు వాస్తవ అవసరాలలో చిన్న భాగాన్ని మాత్రమే తీర్చగలుగుతున్నాయి. అవసరమైన నిధులు, ప్రస్తుతం లభిస్తున్న నిధుల కంటే 12 నుంచి 14 రెట్లు ఎక్కువగా ఉన్నాయని నివేదిక స్పష్టం చేస్తోంది.

ఈ నిధుల లోటు తీవ్ర పరిణామాలకు దారితీస్తోంది. 2021లో ఆమోదించబడిన గ్లాస్గో క్లైమేట్ ప్యాక్ట్ ప్రకారం, 2019 స్థాయిలతో పోల్చితే 2025 నాటికి అంతర్జాతీయ ప్రజా అనుసరణ నిధులను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ప్రస్తుత ధోరణులు కొనసాగితే, ఈ లక్ష్యం సాధ్యపడే అవకాశాలు తక్కువగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక, ప్రతిపాదిత న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ కూడా పెరుగుతున్న అనుసరణ నిధుల అంతరాన్ని తగ్గించేందుకు తగిన స్థాయిలో లేదని వారు అభిప్రాయపడుతున్నారు.

సరిపడని అనుసరణ నిధుల ప్రభావం అత్యంత తీవ్రంగా బలహీన దేశాలపై పడుతోంది. ఇప్పటికే తీవ్ర వాతావరణ ఘటనలు, సముద్ర మట్టం పెరుగుదల,



ప్రభుదాస్ గండమళ్ళ
ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మరియు ప్రపంచ బ్యాంకు సివిల్ సొసైటీ పాలసీ ఫోరమ్ సభ్యుడు, వాషింగ్టన్ డి.సి, అమెరికా.
9441464767 ; 9390381267

ఆహార భద్రత లోపం, నీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్న ఈ దేశాలు, తక్షణం మరియు గణనీయమైన ఆర్థిక సహాయం అందకపోతే, ప్రజల ప్రాణాలు, జీవనోపాధులు, పర్యావరణ వ్యవస్థలను రక్షించుకునే సామర్థ్యాన్ని మరింత కోల్పోయే ప్రమాదం ఉంది.

అడాప్టేషన్ గ్యాప్ రిపోర్ట్ స్పష్టమైన హెచ్చరికను జారీ చేస్తోంది: ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక హామీలు బలపరచి, వాటిని అమలు చేయకపోతే, అభివృద్ధి చెందుతున్న దేశాలు వాతావరణ మార్పుల పోరాటంలో "ఖాళీ చేతులతో పరుగెత్తుతున్న" పరిస్థితిలోనే మిగిలిపోతాయి. అంతర్జాతీయ నివేదికల అంచనాల ప్రకారం, రాబోయే దశాబ్దంలో వాతావరణ అనుసరణకు అవసరమైన ఖర్చులు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. వరదలు, కరవు పరిస్థితులు, తీవ్ర తుపానులు, సముద్ర మట్టం పెరుగుదల వంటి సమస్యలు ఎక్కువవుతున్నందున, పేద మరియు మధ్యస్థ ఆదాయ దేశాలకు ప్రతి సంవత్సరం వందల బిలియన్ల డాలర్ల మేర పెట్టుబడులు అవసరమవుతున్నాయి.

అయితే వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుతున్న అంతర్జాతీయ ప్రజా వాతావరణ నిధులు అవసరాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం, అనుసరణ అవసరాలకు అందుతున్న నిధులు వాస్తవ అవసరాల్లో ఒక చిన్న భాగానికే పరిమితమవుతున్నాయి. దీంతో ఆర్థిక లోటు ఏటా మరింత పెరుగుతోంది.

ఈ నిధుల కొరత కారణంగా అత్యంత ప్రభావితమవుతున్నవి బలహీన దేశాలే. వ్యవసాయంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలు దెబ్బతినడం, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడటం, తాగునీటి కొరత, తీర ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధులు ప్రమాదంలో పడటం వంటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయి. సరైన అనుసరణ చర్యలు చేపట్టలేకపోవడం వల్ల ప్రకృతి విపత్తుల నష్టాలు మరింత పెరుగుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో వాతావరణ నిధులపై పలు హామీలు ఇచ్చినప్పటికీ, అవి ఆశించిన స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావాలకు తక్కువగా కారణమైన దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయన్న వాదన కూడా బలపడుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అభివృద్ధి చెందుతున్న దేశాలు వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కోవాలంటే, అంతర్జాతీయ సహకారం, పారదర్శక నిధుల వ్యవస్థలు, మరియు దీర్ఘకాలిక పెట్టుబడులు అత్యవసరం. అదే సమయంలో, ప్రపంచ దేశాలు తమ హామీలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

లేకపోతే, వాతావరణ మార్పుల ప్రభావాలకు తట్టుకునే సామర్థ్యం లేకుండా, ఇప్పటికే సంక్షోభంలో ఉన్న దేశాలు మరింత వెనుకబడే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ప్రపంచ దేశాలు తమ బాధ్యతను గుర్తించి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందని, అంతర్జాతీయ వాతావరణ మార్పులపై విడుదలైన తాజా నివేదికలు మరియు నిపుణుల విశ్లేషణలతో తెలుస్తుంది.

# స్మశానం...మానవ జన్మకు పుణ్యస్థలమా...!?

పుట్టిన ప్రతి మనిషికి పరిచయం అక్కర్లేని ప్రదేశం.పుట్టాక వేసే బుడిబుడి అడుగుల నడక తడబడుతూ సాగేది ఆ చోటుకే.ఎవరు అవునన్నా ఎవరు కాదన్నా కాలం మారుతున్నా,కంప్యూటర్లు వచ్చినా కాటికి పోవడం పక్కా. ఆస్తులు, అంతస్తులు, డబ్బు, హోదా,పరపతి,పదవి,గర్వం,కోపం,శాంతం,దుఃఖం,ఆనందం,సుఖం, సంతోషం, అసూయ, ద్వేషం,ఆకలి,దాహం,మోహం,కామం,క్రోధం,అందం,ఆనందం,అనురాగాలు,ఆప్యాయతలు,బంధాలు,బంధుత్వాలు అన్నీ మనిషికి అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పలకరించే తాత్కాలికమైన సహవాసాలు.కొంతకాలం వెంటే ఉన్నట్లుగా అనిపిస్తాయి, అంతలోనే మాయమైపోతాయి. అవి నిజమనుకొని నమ్మి మనిషి మోసపోతూనే ఉంటాడు.కట్ట కాలే వరకు,మట్టిలో కలిసే వరకు భ్రమల్లో బ్రతికేస్తూనే ఉంటాడు. అయినా ఒక్కసారి కూడా వాస్తవంలోకి తొంగి చూడడానికి ఏమాత్రం సాహసం చేయడు. గతించిన కాలం ఏం నేర్పింది మానవ జీవితం ఒకనాటకం లాంటిదని పురాణాలు చెబుతాయి.ఆ నాటకంలో జననం మొదటి అంకం అయితే, మరణం చివరి అంకం.మధ్యలో ఎన్ని సంఘటనలు, భావోద్వేగాలు,సంఘర్షణలు ఉన్నా,చివరికి తెరపడేది స్మశానంలోనే."స్మశానం మానవ జన్మకు పుణ్యస్థలమా అనే ప్రశ్నకు సరైన సమాధానం అవుననే వస్తుంది.జీవితమనే నాటకానికి తెరపడిన చివరి అంకంతో మనిషి నిన్ను చేరుకోక తప్పదమ్మా ఓ స్మశానమా అనేదే అసలైన అర్థం.స్మశానం కేవలం మరణానికి సాక్షిగా మాత్రమే కాదు.అది జీవితానికి పుణ్యస్థలమని హిందూ దర్శనంలోనూ,ఆధునిక మానసిక శాస్త్రంలోనూ, సాహిత్యంలోనూ ఎన్నోసార్లు రుజువైంది.ఎప్పటికీ రుజువు చేస్తూనే ఉంటుంది.

స్మశానం మరణానికి సాక్షి లేదా జీవితానికి గురువు

స్మశానం అనగానే మన మనస్సులో మొదట వచ్చేది భయం,దుఃఖం,అంతం.కానీ,భారతీయ ఆధ్యాత్మికతలో స్మశానం ఒక పుణ్యస్థలం.ఉపనిషత్తులు, భగవద్గీత వంటి గ్రంథాలు మరణాన్ని జీవిత సైకిల్‌లో ఒక భాగంగా చూపిస్తాయి."జాతస్య హి ధ్రువో మృత్యుః"(జన్మించిన ప్రతి ఒక్కరూ మరణించక తప్పదు) అని గీత చెబుతుంది. స్మశానం ఆత్మకు ముక్తి మార్గంగా చెబుతారు.హిందూ సంస్కృతిలో అంత్యక్రియలు స్మశానంలో జరగడం వల్ల అది పుణ్యక్షేత్రంగా పరిగణించబడుతుంది.అక్కడ శరీరం అగ్నికి అర్పించబడుతుంది,ఆత్మ ముక్తి పొందుతుంది.ఎందుకంటే అది మనకు అనిత్యత్వాన్ని గుర్తుచేస్తుంది.జీవితం తాత్కాలికమని,సార్థకంగా జీవించాలని బోధిస్తుంది.



ఆధునిక సమాజంలో స్మశానం భయానికి చిహ్నంగా మారింది. పాశ్చాత్య దర్శనంలో మరణం ఒక ట్రాజెడీగా భావిస్తారు.ఫ్రెంచ్ ఫిలాసఫర్ జీన్-పాల్ సార్త్రే మరణాన్ని "అర్థరహితం" అని పిలిచాడు.కానీ,తూర్పు దర్శనంలో అది ఒక పరివర్తన, బౌద్ధ ధర్మంలో స్మశానం ధ్యాన స్థలం.టిబెటన్ బుక్ ఆఫ్ ది డెడ్ ప్రకారం మరణం తర్వాత ఆత్మ పునర్జన్మకు సిద్ధమవుతుంది. స్మశానం మనిషిని జీవితానికి తిరిగి పంపుతుంది.అంటే అది జన్మకు మూలం.మనిషి స్మశానాన్ని చేరుకోక తప్పదు. కానీ,అది చివరి అంకం కాదు, అది కొత్త నాటకానికి మొదలుగా భావిస్తుందంటాడు.జీవితం నాటకంలో స్మశానం తెరపడిన చివరి అంకమని ఆంగ్ల రచయిత షేక్స్పియర్ "ఆల్ ది వరల్డ్ ఈజ్ ఎ స్టేజ్"లో అన్నాడు.జీవితం ఒక నాటకం,మనమంతా నటులం. మొదటి అంకంలో బాల్యం, యవ్వనం,మధ్యలో ప్రేమ, సంఘర్షణలు.చివరి అంకంలో వృద్ధాప్యం,మరణం.స్మశానం ఆ చివరి అంకమే కానీ,దుఃఖకరం కాదు,అది జీవితాన్ని పూర్తి చేస్తుంది.ఇక భారతీయ సాహిత్యంలో కాళిదాసు "శకుంతల"లో మరణాన్ని ప్రకృతి సైకిల్‌గా చూపాడు.స్మశానం మట్టికి తిరిగిపోయే స్థలమని, అక్కడ నుంచి కొత్త జీవితాలు పుడతాయంటారు.మానసిక శాస్త్రంలో ఎలిజబెత్ కుబ్లర్-రాస్ "డెత్ అండ్ డైయింగ్"లో మరణాన్ని ఐదు దశలుగా వివరించింది. డినైయల్, ఆంగర్, బార్గెయినింగ్,డిప్రెషన్,అక్సెప్టెన్స్.స్మశానం అక్సెప్టెన్స్‌కు చిహ్నం. అది మనల్ని జీవితాన్ని మెచ్చుకోమని ప్రేరేపిస్తుంది. ఉదాహరణకు మెక్సికోలో "డే ఆఫ్ ది డెడ్" పండుగలో మరణాన్ని జరుపుకుంటారు.

స్మశానాలు పుణ్యస్థలాలుగా మారతాయి

మన సమాజంలో కూడా స్మశానాలు ధ్యానం,ఆత్మావలోకనానికి స్థలాలుగా మారవచ్చు.కానీ, కొన్ని సవాళ్లు మరియు ఆలోచనలు కూడా తలెత్తవచ్చు. అయితే,స్మశానాలు పుణ్యస్థలాలుగా ఉండాలంటే సమాజం మారాలి.ఇప్పుడు అవి కలుషితం,భయానకంగా ఉన్నాయి.దహనం వల్ల పర్యావరణ సమస్యలు ఉత్పన్నమై కాలుష్యం పెరుగుతుంది.ఎలక్ట్రిక్ క్రిమటోరియమ్‌లు,గ్రీన్ ఫ్యూనరల్స్ వంటివి ఫ్యూచర్ లో అందుబాటులోకి తెచ్చేందుకు ఆలోచించాలి.స్మశానం మానవ జన్మకు పుణ్యస్థలమే.అవును అది మనల్ని జీవితాన్ని సార్థకంగా గడపమని హెచ్చరిస్తుంది.మరణం లేకుండా జీవితం అర్థరహితమవుతుంది. చివరగా స్మశానం మనిషి జన్మకు చివరి అంకం కాదు,అది జీవితానికి పుణ్యస్థలం.అది మనల్ని అనిత్యత్వాన్ని గుర్తుచేసి,సత్కర్మలు చేయమని ప్రేరేపిస్తుంది.మనిషి స్మశానాన్ని చేరుకోక తప్పదు.కానీ,అది భయం కాదు ముక్తి.ఈ ఆలోచనలు మన జీవితాన్ని మరింత గాఢంగా చేస్తాయి. "యత్ర విశ్వం భవతి ఏకనీడం" ప్రపంచం ఒకే గూడులో ఉంది, స్మశానం ఆ గూడు చివరి భాగం. దాన్ని పుణ్యంగా చూడటమే కాదు,పరిపూర్ణంగా అర్థం చేసుకుని జీవించడమే మానవ జన్మకు సార్థకత.

గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

ధర్మఘంట

# అధికారాన్ని బీజేపీ కేంద్రీకరిస్తున్నది



కొచ్చి: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీపై మళ్లీ విమర్శలు చేశారు రాహుల్ గాంధీ దేశంలో అధికారాన్ని కేంద్రీకృతం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కేరళలోని కొచ్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇవాళ ప్రసంగించారు. తమ పార్టీ వికేంద్రీకరణను విశ్వసిస్తుందన్నారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ 73, 74వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ , బీజేపీ అధికారాన్ని కేంద్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగ సవరణలు చేశాయన్నారు. వికేంద్రీకృత అధికారంపై కాంగ్రెస్ నమ్మకానికి అది ఉదాహరణ అని తెలిపారు. కేరళ కొచ్చిలో మహాపంచాయత్ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ స్థానిక సంస్థల సభ్యులను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కూడా పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించడం అంటే అట్టడుగు స్థాయిలో వికేంద్రీకృత పాలనను రక్షించడమేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో ప్రభుత్వం ఏం చేసినా ప్రజలు మౌనంగా ఉండే సంస్కృతి పెరిగిపోతోందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు మౌనంగా ఉంటేనే జాతీయ ఆస్తులను కొందరు పెద్ద వ్యాపారులు నియంత్రించగలరని బీజేపీ కూడా కోరుకుంటోందని రాహుల్ ఆరోపించారు. ప్రజలు మౌనం వీడి ఎన్నికల ద్వారా మాట్లాడాలని సూచించారు.

"73వ, 74వ రాజ్యాంగ సవరణ ఆలోచన కాంగ్రెస్ పార్టీదే అని మీరు గుర్తుంచుకోవాలి. ఒక పౌరుడికి ఒకే ఓటు అనేది రాజ్యాంగానికి పునాది. ప్రతీ ఒక్క పౌరుడికి మన పరిపాలనలో తన గొంతు వినిపించాలనేది రాజ్యాంగం ఆలోచన. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్న వ్యత్యాసం మీరు కొద్దిగా లోతుగా చూస్తే అర్థమౌతుంది. వారు అధికారాన్ని కేంద్రీకరించడం వైపు నిలబడతారు. కాంగ్రెస్ అధికారాన్ని వికేంద్రీకరించడానికి మద్దతు ఇస్తుందని మీకు తెలుస్తుంది. వారు దేశ ప్రజల నుంచి సమ్మతిని కోరుకుంటారు కానీ దేశ ప్రజల గొంతు వినడానికి ఇష్టపడరు."

అంతకుముందు కేరళ కాంగ్రెస్ ప్రకటించిన ప్రియదర్శిని సాహిత్య అవార్డును ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఎమ్ లీలావతికి ప్రదానం చేశారు రాహుల్. కలమస్సెరిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్, ప్రజలు వారి అభిప్రాయాలు, భావాలను వ్యక్తపరిచి వాటి కోసం పోరాడినప్పుడే గొప్ప దేశాలు నిర్మితమవుతాయన్నారు. కానీ ప్రజలు తాము నమ్మిన విషయాన్ని బయటకు చెప్పే ధైర్యం లేదని చెప్పారు. "దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలను గమనిస్తే అందరూ ఏదో ఒకదాన్ని విశ్వసిస్తున్నారు. కానీ, వారు నమ్మే విషయాన్ని బయటకు చెప్పే ధైర్యం లేదు. గొప్ప దేశాలు మౌనంతో నిర్మాణం కాలేవు. ప్రజలు వారి అభిప్రాయాలు, భావాలను వ్యక్తపరిచి వాటి కోసం పోరాడినప్పుడే గొప్ప దేశాలు, గొప్ప ప్రజలు నిర్మితమవుతాయి. ప్రస్తుత మౌన సంస్కృతిలో నాకు దక్కాల్సింది లభిస్తున్నంత కాలం ఏమి జరిగినా పర్వాలేదనే దురాశ భావన ఇమిడి ఉంది. ప్రజలు అవమానాలు, హత్యలకు గురవడాన్ని చూస్తున్నాను. " అని రాహుల్ గాంధీ అన్నారు.

# హైవేకు 500మీటర్ల పరిధిలో మద్యం షాపులపై సుప్రీం కీలక ఆదేశాలు



జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో మద్యం షాపుల తొలగింపుపై సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారులపైన ఉన్న వైన్ షాపులను తొలగించడం లేదా తరలించాలంటూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైందేనని చెప్పిన సుప్రీం, కానీ తీర్పుపై సమగ్ర అధ్యయనం అవసరమని అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాద మరణాలపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు, నిజానికి చాలా మరణాలు జరిగాయని పేర్కొంది. మద్యం మత్తులో వాహనం నడపడం పెను ప్రమాదానికి దారి తీస్తుందని చెప్పింది. భవిష్యత్తులో మద్యం విధానాన్ని రూపొందించే క్రమంలో ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. 2025 నవంబర్ 24న రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రామ్‌స్వరూప్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.

**ప్రజా భద్రతా సమస్యగా మిగిలిపోయాయన్న సుప్రీం**

ఈ సమస్య చాలా సున్నితమైనదని, పరిష్కారం కోసం కొన్ని విధానపర నిర్ణయాలను అమలు చేయాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు పేర్కొంది. మద్యం వినియోగం, హైవేలపై ప్రమాదాలతో ముడిపడి ఉన్న మరణాలు ఒక ప్రధాన ప్రజా భద్రతా సమస్యగా మిగిలిపోయాయని ధర్మాసనం అభిప్రాయపడింది. దీని పరిష్కారానికి సమగ్ర విధానపర నిర్ణయం అవసరమని చెప్పింది.

**రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలపై స్టే**

మరోవైపు హైకోర్టు ఉత్తర్వును అమలు చేయడానికి అనుమతిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదించారు. ఏ పక్షానికి ఎటువంటి అవకాశం ఇవ్వకుండానే ఈ ఉత్తర్వును జారీ చేశారని పిటిషనర్ తరపున న్యాయవాది కోర్టుకు చెప్పారు. ఈ క్రమంలోనే రాజస్థాన్ ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అనేక నగరాలు, పట్టణాలు జాతీయ లేదా రాష్ట్ర రహదారులపై మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. 500 మీటర్ల నియమాన్ని పూర్తిగా అమలు చేయడం వల్ల పెద్ద పట్టణ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు తొలగిపోతాయని కోర్టుకు తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం దుకాణాలు ఉండకూడదని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించిందని గుర్తు చేశారు. అయితే ఈ రహదారులు నగరాలు, పట్టణాల గుండా వెళ్లే చోట ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. ఈ క్రమంలోనే మున్సిపల్ పరిధిలో మద్యం దుకాణాలపై అలాంటి నిషేధం ఉండదని ఆ ఉత్తర్వులపై తర్వాత స్పష్టత ఇచ్చారని వివరించారు. ఈ ఉత్తర్వు అమలులో ఆచరణాత్మక ఇబ్బందులను లెవనెత్తిన ఆయన, దానిని నిలిపివేయాలని పిటిషన్‌కు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెండు పక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.

**రెండు నెలల్లో తొలగించాలని రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలు**

అంతకుముందు హైవేలను లిక్కర్ ఫ్రెండ్లీ కారిడార్‌లుగా మార్చారంటూ రాజస్థాన్ ప్రభుత్వాన్ని హైకోర్టు విమర్శించింది. రోడ్డు ప్రమాద మరణాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో ఉన్న 1,102 మద్యం దుకాణాలను తొలగించడం లేదా మరో చోటుకు తరలించాలని ఆదేశించింది. మున్సిపల్, స్థానిక సంస్థలు లేదా చట్టబద్ధమైన అభివృద్ధి సంస్థల పరిధిలోకి వచ్చినా రాకపోయినా, రెండు నెలల్లోగా తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పింది. ఇంకా ప్రయాణికులకు కనిపించే విధంగా రహదారులపై మద్యం అమ్మకాలను ప్రోత్సహించే ఎలాంటి సైన్‌బోర్డులు, హోర్డింగ్‌లు లేదా ప్రకటనలు ఉండకూడదని స్పష్టం చేసింది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉత్తర-పశ్చిమ ప్రాంతంలో భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. భోపాలపట్నం-ఫర్సేగఢ్ సరిహద్దుల్లోని అటవీ, కొండ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ ఇంచార్జ్ డీవీసీఎం దిలీప్ బెండ్జా సహా మొత్తం ఆరు మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మావోయిస్టుల కదలికలపై అందిన నమ్మకమైన సమాచారంతో డీఆర్‌జీ బీజాపూర్, డీఆర్‌జీ దంతేవాడ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు (202, 206, 210 బెటాలియన్లు), సీఆర్‌పీఎఫ్ 214 బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందాలు ఈనెల 17న ప్రత్యేక సర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో జనవరి 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి. మృతులను దిలీప్ బెంజా (రివార్డు రూ.8 లక్షలు), మాధవి కోసా (రూ.5 లక్షలు), పాలో పోడియం (రూ.5 లక్షలు), లఖీ మద్కం (రూ.5 లక్షలు), జుగ్లో బంజం (రూ.2 లక్షలు), రాధా మెట్ట (రూ.2 లక్షలు)గా గుర్తించారు. వీరిపై మొత్తం రూ.27 లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం తెలిపారు. కీలక నేత దిలీప్ బెంజాపై బీజాపూర్ జిల్లాలో 135 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనాస్థలంలో నుంచి రెండు ఏకే-47లు, ఒక ఇన్సాస్, రెండు 0.303 రైఫిళ్లు, ఒక కార్బైన్‌తో పాటు పేలుడు పదార్థాలు, వైర్‌లెస్ సెట్లు, మావోయిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ బెండ్జాపై 135కు పైగా కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక




భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## ఉగ్రవాదంపై చర్యలు తీసుకోవాలే కానీ, ఆజ్యం పోయకూడదు



భారత్‌తో స్నేహ సంబంధాలు కోరుకునే దేశాలు ఉగ్రవాదంపై మెతక వైఖరిని విడనాడాలని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి రాడోస్లావ్ సికోర్స్కితో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది పాకిస్థాన్ పర్యటన సందర్భంగా రాడోస్లావ్ జమ్ము కశ్మీర్‌పై స్పందిస్తూ, కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని పాక్ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జైశంకర్ స్పందిస్తూ, ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుందని, కాబట్టి తమ దేశంతో స్నేహం కోరుకునే వారు ఉగ్రవాదంపై మెతక వైఖరిని ప్రదర్శించవద్దని కోరారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి రాడోస్లావ్‌కు తెలుసని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదానికి ఎవరూ ఆజ్యం పోయకూడదని జైశంకర్ హితవు పలికారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్-పోలండ్ మధ్య సంబంధాలు స్థిరంగా కొనసాగుతున్నాయని, వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఏరుతుక్రమంపై అవగాహన, శానిటరీ ప్యాడ్ల తయారీ, స్వయం ఉపాధి 'ఫకీర్' యూనివర్సిటీ వినూత్న కార్యక్రమం

ప్రపంచం టెక్నాలజీలో దూసుకెళ్తున్నా కొన్ని విషయాల్లో ఎలాంటి మార్పు ఉండటం లేదు. ముఖ్యంగా మహిళల రుతుక్రమం విషయంలో ఇప్పటికి మూరుమూల ప్రాంతాల్లో ఉండే మహిళలకు సరైన అవగాహన లేక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అయితే ఒడిశాకు చెందిన ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు గిరిజన ప్రాంతాల్లో ఉండే మహిళలు రుతుక్రమంలో ఉన్నప్పుడు శుభ్రంగా ఎలా ఉండాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. 'కాళికా' అనే కార్యక్రమం ద్వారా యూనివర్సిటీ క్యాంపస్‌లోనే శానిటరీ ప్యాడ్‌ల తయారీని ప్రారంభించి, వాటిని ఉచితంగా పంపిణీ చేస్తూ సామాజిక బాధ్యతను చాటుతున్నారు. అంతేకాకుండా ఉపాధిని అందించడానికి విద్యార్థులు కొంతమందికి శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రముఖ కవి ఫకీర్ మోహన్ సేనాపతి జయంతి మకర సంక్రాంతి సందర్భంగా 'కాళికా' ప్రాజెక్టును ప్రారంభించారు. మొదటి దశలో విశ్వవిద్యాలయం దత్తత తీసుకున్న నూపాధి, మర్ధరాజ్‌పూర్ గ్రామాల్లోని మహిళలకు ఈ ప్యాడ్‌లను ఉచితంగా అందిస్తున్నారు. కేవలం పంపిణీ మాత్రమే కాకుండా, విద్యార్థులు, సిబ్బందికి ఈ ప్యాడ్‌ల తయారీలో శిక్షణ ఇస్తూ వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్నారు. తొలి విడతలో భాగంగా ఈ రెండు గిరిజన గ్రామాలలోని మహిళల్లో శానిటరీ ప్యాడ్‌ల గురించి అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రాబోయే రోజుల్లో హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఎమామి పేపర్ మిల్లు ఆర్థిక సహాయం అందిస్తోంది. ఒడిశాకు చెందిన 'ప్యాడ్ గర్ల్' పాయల్ పటేల్ నేతృత్వంలోని 'పాయల్ ఇన్‌స్టిట్యూట్' ఈ ప్రాజెక్టుకు అవసరమైన యంత్రాలను, సాంకేతిక శిక్షణను అందించింది. ప్రతి ప్యాడ్‌లో పేపర్, పాలిమర్, రక్షణ అనే మూడు పొరలు ఉంటాయి. ప్యాడ్‌లు తయారు చేసిన తర్వాత వాటిని యూవీ సాంకేతికతతో శానిటైజ్ చేస్తారు. ఈ యూనిట్‌లో ఒకేసారి 100 ప్యాడ్‌లను శానిటైజ్ చేసి చేసే సామర్థ్యం ఉంది. మార్కెట్లో దొరికే బ్రాండెడ్ ఉత్పత్తుల కంటే ఇవి మెరుగైన నాణ్యతతో ఉన్నాయని టెక్నాలజీ ఇన్‌క్యుబేషన్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సునేందు నాయక్ తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో తమ సొంతంగా శానిటరీ ప్యాడ్‌లను తయారు చేసే యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. తద్వారా స్వయం ఉపాధి పొందేలా వారికి శిక్షణ ఇస్తున్నారు.

సాధారణంగా మార్కెట్లో శానిటరీ ప్యాడ్ల కంటే ఇవి తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురానున్నట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ సంతోష్ కుమార్ త్రిపాఠి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఒకవైపు మహిళల్లో రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూనే, మరోవైపు విద్యార్థులు, సిబ్బందికి నైపుణ్య ఆధారిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రమైన శానిటరీ ఉత్పత్తులు అందుబాటులో లేకపోవడం వల్ల వచ్చే ఇన్ఫెక్షన్లు, ఆరోగ్య సంక్లిష్టతలను 'కాలిక' ద్వారా తగ్గిస్తున్నట్లు చెప్పారు. "మార్కెట్లో శానిటరీ ప్యాడ్ల ప్యాకెట్ ధర సుమారు రూ.70 ఉంటే, మా యూనిట్‌లో తయారయ్యేవి రూ.30కే అందిస్తాం. ప్రస్తుతం అవగాహన కార్యక్రమం కింద ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ఒక్క ప్యాడ్ తయారీకి అయ్యే ఖర్చు కేవలం రూ.3.70 మాత్రమే. యూనిట్ విజయవంతంగా నడిస్తే,పనిచేసే వారికి ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తాం" - వైస్ ఛాన్సలర్ డాక్టర్ సంతోష్ కుమార్ త్రిపాఠి

**భవిష్యత్‌లో కంపెనీగా నమోదు**

ప్రస్తుతం తయారవుతున్న ప్యాడ్లు అన్నీ ఉచిత పంపిణీకే వినియోగిస్తున్నామని, త్వరలో ఈ యూనిట్‌ను ఒక సంస్థగా నమోదు చేస్తామని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కుకుమినా దాస్ తెలిపారు. నిబంధనల ప్రకారం భారీ ఎత్తున ఉత్పత్తి చేసి మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే విక్రయించే యోచన ఉందన్నారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు చెప్పారు.

ధర్మఘంట

# లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ

-మొదటిపేజీ తరువాయి

ఈ స్కీమ్‌ను వర్తింప ేజేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం 2023 డిసెంబరు 28వ తేదీ నుంచి 2024, జనవరి 6 వరకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో గృహ జ్యోతి దరఖాస్తులు స్వీకరించింది. 200 యూనిట్లకు ఒక యూనిట్ అదనంగా వాడినా బిల్లును చెల్లించాల్సి ఉంటుంది. ఈ భారం పడకుండా పేదలు, మధ్య తరగతి ప్రజలు పొదుపుగా కరెంట్‌ను వినియోగిస్తున్నారు. తక్కువ విద్యుత్ వినియోగం అవుతుందనే ఉద్దేశంతో అనేక మంది ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ల వినియోగం వైపుగా మొగ్గు చూపుతున్నారు. గృహోపకరణాలను చాలా జాగ్రత్తగా వాడుతున్నారు. గృహజ్యోతి అమల్లోకి వచ్చాక తక్కువ విద్యుత్తు బిల్లు వచ్చేందుకు 5 స్టార్ రేటింగ్ ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను లబ్ధిదారులు కొనుగోలు చేస్తున్నారు. గృహజ్యోతి పథకం ప్రారంభమైనప్పుడు దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమందికి ఈ పథకం వర్తించలేదు. దీంతో గ్రామీణులు ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణవాసులు పుర కార్యాలయాల్లో మరోమారు దరఖాస్తులను సమర్పించారు. ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. గృహజ్యోతి వర్తింపునకు ప్రభుత్వం తమకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదని, వచ్చిన వెంటనే కొత్తవారికి కూడా గృహజ్యోతి పథకం వర్తించేలా చూస్తామని స్పష్టం చేశారు. 10 ఏళ్లుగా రేషన్‌కార్డులు మంజూరు కాకపోవడంతో గత, ప్రస్తుత ప్రభుత్వంలో పలు పథకాలకు చాలా మంది అర్హులు దూరమయ్యారు. కొన్ని నెల క్రితమే వారికి రేషన్‌కార్డులను మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.

**ఛేంజ్ ఓవర్‌తో మాయ చేస్తూ**

గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిదారుల బిల్లును ప్రభుత్వం సంబంధిత విద్యుత్తు సంస్థకు చెల్లిస్తోంది. అధికశాతం మంది లబ్ధిదారులు ముందస్తు ఆలోచనతో విద్యుత్తును వినియోగించుకుంటున్నారు. మరికొందరు విద్యుత్తును అధికంగా వినియోగించుకుని రాయితీని కోల్పోతున్నారు. ఒకే ఇంట్లో రెండు నుంచి నాలుగు విద్యుత్ మీటర్లు ఉన్న పక్షంలో గృహజ్యోతి కనెక్షన్ మీటరుకు, మరో మీటరుకు ఛేంజ్ ఓవర్‌ను బిగించి పరిమితి మేరకు వినియోగించుకుంటున్నారు. గృహజ్యోతి మీటరుకు వాటర్ హీటర్, వాషింగ్ మిషన్, కూలర్లు, ఏసీల కనెక్షన్ ఇస్తూ 200 యూనిట్లలోపు వినియోగిస్తుండటం గమనార్హం. రూల్స్‌నకు విరుద్ధంగా ఛేంజ్ ఓవర్‌లు బిగించి విద్యుత్తు వినియోగిస్తుండటం గమనార్హం. ఈ విషయంపై విద్యుత్తు ఉద్యోగులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనేటువంటి ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రక్రియను కట్టడి చేసిన పక్షంలో సంస్థకు గణనీయమైన ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

**ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి**

రాష్ట్రంలో వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలనే సదుద్దేశంతో ప్రతి సోమవారం విద్యుత్తు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ ప్రత్యేక చొరవతో 2024 జూన్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. పలువురు తమ సమస్యలపై విద్యుత్తుశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

**ఎలాంటి ఇబ్బందులున్నా రాత పూర్వకంగా**

విద్యుత్తు పరంగా ఎలాంటి సమస్య ఉన్నా కంప్లైంట్ చేయవచ్చు. మీటర్ పని చేయకపోయినా, రీడింగ్‌లో తప్పు వచ్చినా, వ్యవసాయం చేసే రైతులకు సిబ్బంది పరంగా ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉన్నా గృహజ్యోతి పథకం అమలు కాకపోయినా, ఇలా ఎలాంటి సమస్య అయినా అధికారులకు రాత పూర్వకంగా తెలియజేయవచ్చు.

# మేడారం టిక్కెట్స్ ఫిక్స్

**వరంగల్ :** మేడారం సమ్మక్క?సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే టిక్కెట్ చార్జీలను ఖరారు చేసింది. హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ.1,110 వరకు.. వరంగల్ నుంచి రూ.250 నుంచి రూ.500 వరకు చార్జీలు నిర్ణయించింది. అలాగే భూపాలపల్లి, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని ఆర్టీసీ స్పష్టం చేసింది.మేడారం సమ్మక్క?సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ మహా జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల వేల సంఖ్యలో బస్సులను మేడారానికి తరలించగా.. తాజాగా దీనికి అనుగుణంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే బస్సుల టిక్కెట్ చార్జీలను ఖరారు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారం, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చింది. బస్సుల రకాన్ని బట్టి చార్జీలు నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణించే వారికి సూపర్ లగ్జరీ, రాజధాని, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, సాధారణ, గరుడ ప్లస్ బస్సులు నడపనున్నారు. వీటికి టిక్కెట్ ధరలు రూ.600 నుంచి రూ.1,110 వరకు ఉంటాయి.అలాగే వరంగల్, హనుమకొండ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది భక్తులు మేడారానికి వెళ్తుండటంతో అక్కడి నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరంగల్, హన్మకొండ నుంచి టిక్కెట్ చార్జీ రూ.250 నుంచి రూ.500 వరకు నిర్ణయించారు. భూపాలపల్లి నుంచి రూ.230 నుంచి రూ.300 వరకు, మహబూబాబాద్ నుంచి రూ.360 నుంచి రూ.410 వరకు చార్జీలు ఉంటాయి. ఖమ్మం నుంచి రూ.480, గోదావరిఖని నుంచి రూ.400, కొత్తగూడెం నుంచి రూ.350 చార్జీగా నిర్ణయించారు. కరీంనగర్ నుంచి మేడారానికి వెళ్లే బస్సుకు రూ.390గా నిర్ణయించారు. ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని తెలంగాణ ఆర్టీసీ స్పష్టం చేసింది. భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు, ప్రత్యేక సిబ్బంది, భద్రతా చర్యలు కూడా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జాతరకు వెళ్లే భక్తులు ముందస్తుగా ప్రణాళిక చేసుకొని ప్రయాణించాలని సూచించారు.



**మహిళల శక్తితో మేడారం**

సమ్మక్క సారక్క దేవతల జాతరకు వేళయింది..ఈసారి జాతర చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా చిత్ర విచిత్రాలు ఆశ్చర్య పరుస్తున్నాయి.. ఈసారి జాతర పూర్తిగా నారీమణుల పెత్తనంలోనే సాగనుంది.. పూర్తిగా మహిళల చేత ట్రస్ట్ బోర్డ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు.. మంత్రి సీతక్క వినూత్న ఆలోచనతో పూర్తిగా అతివల చేత అమ్మల జాతర జరిపించేందుకు సిద్ధమయ్యారు.. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, 11 మంది డైరెక్టర్లు 1 ఎక్స్ అఫీషియ సభ్యులతో కలిసి మొత్తం 14 మందితో మేడారం ఉత్సవ కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు..ఓరుగల్లు పేరు చెప్పగానే రాని రుద్రమదేవి పౌరుషం గుర్తుకొస్తుంది.. నారీమణుల నవశాఖానికి ఓరుగల్లు ఆడబిడ్డల పౌరుషాన్ని చిహ్నంగా భావిస్తారు.. సమ్మక్క సారక్క దేవతలను వీరవనితలుగా.. ధీరత్వానికి.. పౌరుషానికి.. ప్రతీకలుగా కొలుస్తారు.. పాలకుల ప్రయోగంతో ఓరుగల్లు స్త్రీ శక్తికి చిహ్నంగా నిలుస్తుంది.. ఇప్పటికే వరంగల్ ఉమ్మడి జిల్లా అంతా అతివల పాలనలోనే కొనసాగుతుంది.. తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ లో ఇద్దరు మహిళా మంత్రులు ఉండగా ఆ ఇద్దరు కొండా సురేఖ, సీతక్క వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందినవారే కావడం విశేషం?వీళ్ళిద్దరు మాత్రమే కాదు.. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు గా డాక్టర్ కడియం కావ్య, వరంగల్ మేయర్ గా గుండు సుధారాణి ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారు.. వరంగల్ కలెక్టర్ గా సత్యశారదాదేవి, హనుమకొండ కలెక్టర్ గా స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా చాహత్ వాజ్ పాయ్, వరంగల్ సెంట్రల్ జోన్ పోలీస్ కమిషనర్ గా సరిత స్త్రీ శక్తిని చాటుతున్నారు.తాజాగా నవశకానికి నాంది పలికిన మంత్రి సీతక్క మేడారం జాతరలో ఓ వినూత్న ప్రయత్నం చేశారు.. మేడారం జాతర ఉత్సవ కమిటీ పగ్గాలు మహిళలకే కట్ట బెట్టారు.. చైర్ పర్సన్ గా ఇరుప స్వరూపతో పాటు మరో 12 మంది మహిళా డైరెక్టర్లు, ఒకరు ఎక్స్ అఫీషియా సభ్యుడి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అతివల బాధ్యతల స్వీకరణ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.. ధీరత్వానికి ప్రతీకగా కొలబడే సమ్మక్క సారక్క దేవతలే నారీమణులకు స్ఫూర్తి అంటున్న మంత్రి సీతక్క.. ఈసారి పూర్తిగా మహిళల చేతుల మీదుగా జాతర బాధ్యతలు నిర్వహించడం ఓ వరంగా భావిస్తున్నారు.. సమ్మక్క సారక్క దేవతల స్ఫూర్తితో జాతర నిర్వహణలో స్త్రీ శక్తిని చాటుతామన్నారు..రాష్ట్రంలో ఎక్కడా.. ఎప్పుడు కని విని ఎరుగని విధంగా పూర్తిగా మహిళలకే పరిపాలన పగ్గాలు అప్పచెప్పి..ఇంత పెద్ద జాతర నిర్వహణ వారి భుజస్కందాలపై పెట్టడం చర్చగా మారింది.. శ్రీ శక్తిని నిరూపించుకునే గొప్ప అవకాశం లభించిందని తమకు లభించిందనీ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ చైర్ పర్సన్ తో సహా డైరెక్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..మేడారం జాతర చరిత్రలో ఇప్పటికే అనేక అద్భుతాలు అబ్బుర పరుస్తుండగా.. తాజాగా నారీమణుల చేతికి పరిపాలన పగ్గాలు అప్ప చెప్పడం మరింత చర్చగా మారింది.. ఇంతపెద్ద జాతర నిర్వహణ బాధ్యతలు వారి భుజాలపై వేసుకున్న అతివలు సమ్మక్క సారక్క స్ఫూర్తితో సక్సెస్ చేస్తారని ఆశిద్దాం.

# ఖమ్మం జిల్లాలో రెండో జాతీయ రహదారి

**ఖమ్మం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మరో జాతీయ రహదారి మంజూరైంది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కొత్తగూడెం నుండి హైదరాబాద్‌కు ప్రయాణ దూరం 40 కిలోమీటర్లు తగ్గుతుంది. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు మీదుగా గౌరెల్లి జంక్షన్ వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందుకోసం ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు రవాణా రంగంలో ఒక గొప్ప శుభవార్త అందుతోంది. జిల్లా మీదుగా మరో సరికొత్త జాతీయ రహదారి రాబోతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను పారిశ్రామిక కేంద్రమైన కొత్తగూడెంతో అనుసంధానించే జాతీయ రహదారి 930పీ నిర్మాణ పనుల్లో ఇప్పుడు కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా గెజిట్ (3డీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది జిల్లా ప్రగతికి సరికొత్త బాటలు వేయనుంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండా వెళ్లే రెండో జాతీయ రహదారిగా ఇది నిలవనుంది. ఇల్లెందు మరియు కొత్తగూడెం మధ్య ఉన్న మూడు మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల, టేకులపల్లి మండలంలోని బేతంపూడి, గొల్లపల్లి మరియు లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ వంటి గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. ఈ భూములకు సంబంధించి మార్కెట్ విలువ ప్రకారం రైతులకు త్వరలోనే నష్టపరిహారం చెల్లించనున్నారు.ప్రస్తుతం కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ఖమ్మం లేదా సూర్యాపేట మీదుగా వెళ్లాల్సి వస్తోంది. కానీ ఈ కొత్త జాతీయ రహదారి 930పీ అందుబాటులోకి వస్తే.. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు, వలిగొండ మీదుగా నేరుగా హైదరాబాద్‌లోని గౌరెల్లి జంక్షన్‌ను చేరుకోవచ్చు. దీనివల్ల దాదాపు 40 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా ఆదా అవుతుంది.ఈ రహదారి కేవలం ప్రయాణికులకే కాకుండా.. పారిశ్రామిక రవాణాకు వెన్నెముకగా మారుతుంది. జిల్లాలో ఉన్న మైనింగ్, యంత్రాల రవాణా సులభతరమవుతుంది. అలాగే, హైదరాబాద్ నుండి భద్రాచలం వెళ్లే భక్తులకు కూడా ఇది సులభమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది. అత్యవసర వైద్య సేవల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన వారికి ఈ రోడ్డు ఒక వరప్రదాయినిలా మారనుంది. ప్రమాదాలను తగ్గించేలా ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరిస్తుండటం విశేషం.

## కవిత కొత్త పార్టీ...

-మొదటిపేజీ తరువాయి

పరిమితం కాకుండా, కార్యాచరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఆమెకు సహాయం అందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత రెండు నెలల వ్యవధిలో ప్రశాంత్ కిశోర్ రెండుసార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా కూడా వీరి మధ్య భేటీ జరిగినట్లు తెలుస్తోంది. కొత్త పార్టీని ప్రకటిస్తే రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయి, పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, అనుసరించాల్సిన వ్యూహాలు వంటి కీలక అంశాలపై వీరిద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ సమావేశాలపై కవిత గానీ, తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. మరోవైపు తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకే కొత్త పార్టీ అవసరమని కవిత బలంగా వాదిస్తున్నారు. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చి, 2029 ఎన్నికల్లో ప్రజల పక్షాన పోటీ చేస్తామని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీ విధివిధానాల రూపకల్పనకు దాదాపు 50 కమిటీలతో అధ్యయనం చేయిస్తున్నారు. అదే సమయంలో మైనార్టీలు, బీసీలు, యువత తనతో కలిసి రావాలని, తన 'తెలంగాణ సెక్యులర్ పార్టీ'కి మద్దతివ్వాలని పిలుపునిస్తున్నారు. గతంలో ఏపీలో వైఎస్ జగన్‌కు, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్‌కు, వ్యూహకర్తగా పనిచేశారు. తమిళనాడులో నటుడు విజయ్ పార్టీకి కూడా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు కవితతో జతకట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు కవిత క్షేత్రస్థాయి సన్నాహాలు, మరోవైపు పీకే వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో త్వరలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ కొత్త రాజకీయ ప్రయోగం తెలంగాణలో ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

**స్పీకర్‌కు వివరణ ఇచ్చిన ఎమ్మెల్యేలు**

ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారించిన సుప్రీంకోర్టు పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకసారి 3 నెలలు, తర్వాత మరో 4 వారాల సమయాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో న్యాయనిపుణులు, అడ్వకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆ 10 మంది శాసన సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ వివరణలను సభాపతి ప్రసాద్ కుమార్‌కు సమర్పించారు.

**అభివృద్ధి పనుల్లో భాగంగానే కలిశాం**

తాము బీఆర్ఎస్ పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నామని వారు తమ వివరణల్లో పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో భాగంగా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశామని, ఈ సందర్భంగా సీఎం తమను సత్కరించడమే తప్ప తాము పార్టీ కండువా కప్పుకోలేదని వారు అఫిడవిట్ సైతం దాఖలు చేశారు. మరోవైపు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఆ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ ఆధారాలను సభాపతికి సమర్పించారు.

**మొత్తంగా ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్**

మొదటగా ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండోసారి మరో ఇద్దరికి క్లీన్‌చిట్ ఇచ్చిన ఆయన మరో ఎమ్మెల్యేకు సంబంధించి తీర్పు రిజర్వులో ఉంచారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లపై ఇంకా విచారణ పూర్తి కాలేదు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు చెందిన అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగాల్సి ఉంది.

**అనర్హత పిటిషన్లు కొట్టేసిన స్పీకర్**

నోటీసులు ఇచ్చిన తర్వాత నెలల సమయం తీసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్‌కు తన సమాధానాన్ని రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దీంతో నోటీసులు స్వీకరించిన వారిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కరే సమాధానం ఇవ్వనట్లుగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేసిన సంగతి తెలిసిందే.ఫిర్యాదులు, రికార్డుల్లో ఉన్న ఆధారాల పరిశీలన, అలాగే సంబంధిత అన్ని పక్షాలకు సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా పూర్తి వాదనలు వినే అవకాశం కల్పించిన అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించారు. పదో షెడ్యూల్‌లోని పేరా 6 ప్రకారం ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ తెలంగాణ శాసనసభ(పార్టీ మార్పు కారణంగా అనర్హత) నియమాలు-1986 ఆధారంగా స్పీకర్ ఈ తీర్పునిచ్చారు.

## తెలంగాణలో పురపోరుకు సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

సంస్థలతో పాటు 116 పురపాలికల్లో ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు సిద్ధమయ్యాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవగా, వాటిపై గెజిట్లు జారీ అయ్యాయి.రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు ఒకే దఫాలో ఎన్నికలు జరపాలని ఈసీ భావిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత 15 రోజుల్లో పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తైన తర్వాత రెండ్రోజులకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగి ఎన్నికలకు ఆటంకం కలిగితే మరుసటి రోజు రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఆ తర్వాత రోజు అధికారులు ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తారు. ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఎన్నికైన కార్పొరేటర్లతో మేయర్, డిప్యూటీ మేయర్, వార్డు కౌన్సిలర్లతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలు జరిపి ఫలితాలను ప్రకటిస్తారు.స్వతంత్ర అభ్యర్థిని స్థానికంగా పది మంది ఓటర్లు ప్రతిపాదించాలని తెలిపింది. ఒక అభ్యర్థి 4 కంటే ఎక్కువ నామినేషన్లు వేయకూడదని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీ చేసే ఆయా వర్గాల వారు డిప్యూటీ తహసీల్దార్ హోదాకు తగ్గని అధికారి సమక్షంలో చేసిన డిక్లరేషన్‌ను విధిగా జత చేయాలని మార్గదర్శకాల్లో ఈసీ సూచించింది.

## అటు ఎండ ఇటు చలి

**హైదరాబాద్ :** తెలంగాణలో వింత వాతావరణం నెలకొంది. పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రిళ్లు చలి వణికిస్తోంది. ఆదిలాబాద్‌లో 34.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. తిర్యాణిలో 7 డిగ్రీలకు పడిపోయాయి. రానున్న మూడు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ విభిన్న వాతావరణంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన.తెలంగాణ రాష్ట్రంలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పగటిపూట భానుడు తన ప్రతాపాన్ని చూపుతుంటే.. మరోవైపు రాత్రి సమయాల్లో చలి పులి పంజా విసురుతోంది. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఇక్కడ సాధారణం కంటే 4.2 డిగ్రీలు అధికంగా నమోదై.. 34.3 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా పగటి పూట ఎండ తీవ్రత సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరగడం విశేషం. జనవరి మూడవ వారంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉండటం చూస్తుంటే.. రాబోయే వేసవి కాలం ఎంత తీవ్రంగా ఉండబోతుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రి నుంచి ఉదయం వరకు మాత్రం చలి వణికిస్తోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఆదిలాబాద్‌లోని భీంపూర్, సంగారెడ్డి జిల్లా కోహీర్, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగానే నమోదయ్యాయి.

ధర్మఘంట

# ఖాళీ కడుపుతో బొప్పాయి తింటున్నారా?



ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఇది జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది, పేగులను శుభ్రపరుస్తుంది. బొప్పాయిలోని ఫైబర్ బరువును నియంత్రిస్తూ, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరిస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చు. ఉదయం మీ పేగులు సరిగ్గా శుభ్రం కాకపోతే, మీరు బొప్పాయిని క్రమం తప్పకుండా తినవచ్చు. ఇది పేగులలో పేరుకుపోయిన మురికిని శుభ్రపరుస్తుంది. తరచుగా జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఉదయం బొప్పాయి తినడం సహజ నివారణ. మీరు వేగంగా బరువు పెరుగుతున్నట్లయితే, ఈరోజు నుండి మీ ఆహారంలో బొప్పాయిని చేర్చుకోండి. ఇందులో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఫైబర్ ఆహారాన్ని నెమ్మదిగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. జీవక్రియను కూడా పెంచుతుంది. విటమిన్ సి ఉండటం వల్ల బొప్పాయి రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఇది జలుబు, దగ్గు, ఇతర ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. బొప్పాయి చర్మానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, ఇ, బీటా కెరోటిన్ చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల చర్మం తేమను నిర్వహిస్తుంది. మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. బొప్పాయితో చేసిన ఫేస్ ప్యాక్‌ను చర్మంపై అప్లై చేయడం వల్ల అనేక సమస్యలను నివారించవచ్చు. చర్మం మృదువుగా మారుతుంది. టానింగ్, ముడతలు తొలగిపోతాయి. ఇది జుట్టుకు పోషణను అందిస్తుంది. కాబట్టి ఇది జుట్టుకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. బొప్పాయి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ప్రసిద్ధి చెందింది. ఇందులో పొటాషియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తాయి. ఇది రక్తపోటును సమతుల్యంగా ఉంచుతుంది. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్పాహారానికి ముందు ఖాళీ కడుపుతో ఒక గిన్నె తాజా బొప్పాయి తినడం అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని మీ దినచర్యలో చేర్చుకోవడం ద్వారా, మీరు ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

## రోజూ నిమ్మకాయ నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదేనా?



నిమ్మకాయ.. మన వంటింట్లో సులభంగా దొరికే అద్భుత ఔషధం. విటమిన్-సి, పొటాషియం, ఫ్లేవనాయిడ్లకు నిలయమైన నిమ్మరసాన్ని రోజూ తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అందరికీ తెలిసిందే. అయితే దీనిని ఎంతకాలం తాగాలి..? ఎప్పుడు తాగితే మంచిది..? ఆయుర్వేదం ఏం చెబుతోంది? జీర్ణక్రియకు - బరువు తగ్గడం: యలో ఉండే ఆమ్ల రసం వాత, కఫ దోషాలను తొలగిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. ఇది జీర్ణశక్తిని పెంచడమే కాకుండా శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపుతుంది. ముఖ్యంగా ఊబకాయం తగ్గాలనుకునే వారు 15 నుండి 21 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడి మంచి ఫలితాలు కనిపిస్తాయి.నెల రోజులు తాగితే: సాధారణ ఆరోగ్య ప్రయోజనాల కోసం 20-30 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవచ్చు. అయితే ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. ఒక నెల పాటు వరుసగా నిమ్మరసం తాగిన తర్వాత, కనీసం ఒక వారం పాటు విరామం ఇవ్వడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరం సహజ సమతుల్యతను కాపాడుకుంటుంది. రోజూ ఎంత తాగాలి? ఎలా తాగాలి?: శాస్త్రీయ కోణంలో చూస్తే నిమ్మరసం చాలా ఆరోగ్యకరమైన డ్రింక్. కానీ దీనిని పరిమితంగా తీసుకోవడమే క్షేమకరం. రోజుకు ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయను పిండుకుని తాగడం ఉత్తమం. గోరువెచ్చని నీటిని తీసుకుని, అందులో నిమ్మరసం కలిపి తాగాలి. రుచి కోసం కొద్దిగా తేనె కూడా కలుపుకోవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో లేదా భోజనానికి 30 నిమిషాల ముందు తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయి. ప్రయోజనాలు అనేకం: ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఇమ్యూనిటీని పెంచుతాయి. చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. శరీరంలో నీటి లోపాన్ని నివారిస్తుంది.

## పచ్చి బఠానీలు.. పసుపు బఠానీలు ఏవి ఆరోగ్యానికి మంచివి?



పచ్చి, పసుపు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేసి ఇంటికి తీసుకురండి.పచ్చి లేదా పసుపు బఠానీలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. అయితే, శీతాకాలంలోనే ఎక్కువగా పచ్చి బఠానీలను మార్కెట్లో అమ్ముతారు. ఆ తర్వాత, మీరు ఏడాది పొడవునా ఎండబెట్టిన బఠానీలను మాత్రమే తినవచ్చు. పచ్చి బఠానీలను ఎండబెట్టిన తర్వాత, వాటిని పసుపు బఠానీల పేరుతో మార్కెట్‌లో కూడా అమ్ముతారు. ఎండబెట్టిన తర్వాత, పచ్చి బఠానీలు పసుపు రంగులోకి మారుతాయి. కానీ, కొన్నిసార్లు ఎండిన పచ్చి బఠానీలు కూడా మార్కెట్లో లభిస్తాయి. ఇది వేరే రకమైన బఠానీలు. ఎండబెట్టిన తర్వాత కూడా ఈ బఠానీలు పచ్చగా ఉంటాయి. రెండు రకాల పోషక విలువలు కూడా దాదాపు ఒకే విధంగా ఉంటాయి. అయితే, రెండు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేయాలి. వంట కోసం మీరు పచ్చి బఠానీలు లేదా పసుపు బఠానీలను ఉపయోగించవచ్చు. అయితే, వాటి రుచిలో స్వల్ప తేడా ఉంటుంది. పచ్చి బఠానీలు తక్కువ స్టార్చ్ కలిగి ఉంటాయి, పసుపు బఠానీల కంటే తియ్యగా ఉంటాయి. పసుపు బఠానీలు మట్టి, వగరు రుచిని కలిగి ఉంటాయి. అవి పచ్చి బఠానీల కంటే తేలికపాటివి, తక్కువ ఘాటుగా ఉంటాయి. మీ ఆహారంలో బలమైన బఠానీ రుచి ఉండకూడదనుకుంటే.. పసుపు బఠానీలు ఉత్తమం. రెండు రకాల ఎండిన బఠానీలు వండడానికి దాదాపు ఒకే సమయం పడుతుంది. ఆకుపచ్చ, పసుపు బఠానీలు రెండింటిలోనూ ప్రోటీన్, ఫైబర్, విటమిన్ బి, మెగ్నీషియం, ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. ఈ బఠానీలు కాల్షియం, జింక్, నియాసిన్, విటమిన్ ఇ, ఫోలేట్, పొటాషియం కోసం మీ రోజువారీ అవసరాలను తీర్చగలవు. బరువు తగ్గడానికి బఠానీలు ఒక అద్భుతమైన ఎంపిక. అవి జీర్ణక్రియకు సహాయపడతాయి. అవి ఆకలిని నియంత్రించడానికి, జీవక్రియను పెంచడానికి మంచివి. ఈ చిన్న బఠానీలు శక్తినిచ్చే పోషకాలను కలిగి ఉంటాయి. బఠానీలు వాపును తగ్గిస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి, రక్తపోటును నియంత్రిస్తాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. బఠానీలు తినడం వల్ల ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పసుపు బఠానీలను ప్రోటీన్ పౌడర్‌లో ఉపయోగిస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివిగా భావిస్తారు, కానీ పసుపు బఠానీలు పచ్చి బఠానీల కంటే కొంచెం ఖరీదైనవి.

## బ్రోకలీ లేదా క్యాబేజీ బరువు తగ్గడానికి ఏది మంచిది?



ఈ మధ్యకాలంలో చాలా మంది వెయిట్ లాస్ అవ్వాలని, ఫిట్‌గా కనిపించాలని అనుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేక డైట్స్ ఫాలో అవుతున్నారు. డైట్ చేసే సందర్భంలో ఆరోగ్యకరమైన ఆహారాలను ఎంచుకోవడం చాలా ముఖ్యం. అలాంటప్పుడు బ్రోకలీ, క్యాబేజీ వంటి క్రూసిఫెరస్ కూరగాయలు మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతాయి. వీటిలో మన శరీరానికి కావలసిన ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. చాలా మంది బ్రోకలీ అనే సరపేట్‌గా కూరగాయాల్లో ఒకటి అనుకుంటారు. కానీ బ్రోకలీ కూడా క్యాబేజీ కుటుంబానికి చెందిన ఆకుపచ్చ క్రూసిఫెరస్ కూరగాయ. యూఎస్‌డీఏ (యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్) డేటా ప్రకారం, 100 గ్రాముల బ్రోకలీలో సుమారు 34 కేలరీలు, సుమారు 89 గ్రాముల నీరు, 2.8 గ్రాముల ప్రోటీన్, చాలా తక్కువ కొవ్వు, 2.6 గ్రాముల ఫైబర్ మరియు 1.7 గ్రాముల సహజ చక్కెర ఉంటాయి. ఇంకా, బ్రోకలీ విటమిన్ సి, విటమిన్ కె ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తి పెంచడంతో పాటు ఎముకల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. బ్రోకలీలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లూకోసినోలేట్స్, సల్ఫోరాఫేన్ వంటి నిర్దిష్ట సల్ఫర్ సమ్మేళనాలు కూడా ఉన్నాయి, ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. బ్రోకలీలోని ఫైబర్, ముఖ్యంగా కరిగే ఫైబర్, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇంకా, ఫైబర్ కార్బోహైడ్రేట్‌లను నెమ్మదిగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర, ఇన్సులిన్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఇది డయాబెటిస్, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్యాబేజీలో పోషకాలు : క్యాబేజీ బ్రాసికా కుటుంబానికి చెందినది, ఇందులో బ్రోకలీ, కాలీఫ్లవర్, కాలే వంటి కూరగాయలు ఉంటాయి. యూఎస్‌డీఏ డేటా ప్రకారం, 100 గ్రాముల క్యాబేజీలో దాదాపు 25 కేలరీలు, దాదాపు 92 గ్రాముల నీరు, 1.2 గ్రాముల ప్రోటీన్, చాలా తక్కువ కొవ్వు, 2.5 గ్రాముల ఫైబర్ , 3.2 గ్రాముల సహజ చక్కెర ఉంటాయి. క్యాబేజీ విటమిన్ సి, విటమిన్ కె లకు కూడా మంచి మూలం, ఇవి రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా భావిస్తారు. బ్రోకలీ లేదా క్యాబేజీలో ఏది మంచిది?: పోషకాల పరంగా చూసుకుంటే క్యాబేజీ కంటే బ్రోకలీని ఎక్కువ పోషకాలు ఉంటాయి. అంటే ఇందులో ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు, వ్యాధి-రక్షణ సమ్మేళనాలు ఉంటాయి. క్యాబేజీలో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ బ్రోకలి కన్నా తక్కువగా ఉంటాయి. అయితే దీన్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం సులభం. బ్రోకలీ, క్యాబేజీ రెండూ ఆరోగ్యకరమైనవి. మీకు ఏది సరైనదనేది.. మీ అవసరాలు, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. మీకు ఎక్కువ పోషకాలు కావాలంటే బ్రోకలీ మీకు మంచిది. అయితే, క్యాబేజీని రోజువారీ భోజనాలకు ఆరోగ్యకరమైన ఎంపికగా భావిస్తారు.

ధర్మఘంట

## మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయకపోతే

# మూడు పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాం

**బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

**బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**



**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయకపోతే మూడు పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. నిన్న మేడారంలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై కనీసం చర్చించలేదని, బీసీ రిజర్వేషన్లపై చర్చించకుండా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్వహించడం బీసీలను మరోసారి దగా చేయడ మేనని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఫైర్ అయ్యారు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు హైదరాబాదులోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు బీసీ జేఏసీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు . ఆందోళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క వైఖరి మారకపోతే భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన తీవ్రంగా హెచ్చరిం చారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల పై ఎందుకు చర్చించలేదు చట్టపరంగా ఇవ్వలేనప్పుడు పార్టీ పరంగానైనా ఇస్తామని ఎందుకు ప్రకటించడం లేదు మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలని బిజెపి, బిఆర్ ఎస్ పార్టీలు ఎందుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం లేదు గ్రామపంచాయతీ ఎన్నికల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఇక ఎన్నికలైనా నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్పష్టంగా హామీ ఇచ్చి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని నిర్ణయించడం అంటే బీసీలను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసిందని ఆయన మండిపడ్డారు బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు, ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించడం చాలా సిగ్గుచేటు అన్నారు అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు మద్దతిచ్చిన అఖిలపక్ష పార్టీలు ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఏ రాజకీయ పార్టీ కూడా సడిచప్పుడు చేయకుండా మౌనం పాటిస్తున్నాయని, ఈ పార్టీలకు బీసీల పైన కపట ప్రేమ ఉందని మున్సిపల్ ఎన్నికల విషయంలో తేలిపోయింది అన్నారు మెస్సి ఆట కోసం హైదరాబాదుకు వచ్చిన రాహుల్ గాంధీ బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్న హైదరాబాద్ కు వచ్చి ఎందుకు స్పందించడం లేదన్నారు బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు బుట్ట దాఖలు చేస్తుంటే రాహుల్ గాంధీ కళ్ళుమూసు కుంటున్నాడా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై బీసీలకు ద్రోహం తలపెడుతున్నాయని బీసీ రిజర్వేషన్లు తగ్గడానికి స్థానిక ఎన్నికలు జరగడానికి ఈ రెండు పార్టీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ లే కారణమని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు చట్టపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇవ్వలేకపోతే బీసీ సమాజానికి క్షమాపణ చెప్పి పార్టీ గుర్తులతో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీపరంగా జనాభా దామాషా ప్రకారం 56% టికెట్లు ఇస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు,లేదంటే కాంగ్రెస్ ను బీసీలు ఇక జన్మలో నమ్మరని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇక ముగిసిన అధ్యయంగా మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు బీసీ రిజర్వేషన్ల 42 శాతం సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని రెండు రోజుల్లోనే జేఏసీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమం ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ జేఏసీ కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్,బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, జజుల లింగం గౌడ్, బుదాని సదానందం, మాదేశి రాజేందర్, తారాకేశ్వరి, జిల్లెల నరసింహ, గూడూరు భాస్కర్, సంధ్యారాణి, సిద్ధాంతం శ్యామల, శైలజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మి, రాజేశ్వరి,వెంకటేష్, శ్రీనివాసాచారి, గజ్జల సత్యం గౌడ్, జే. వెంకటయ్య,జే. వెంకటమ్మ, నర్సమ్మ, అంజమ్మ, బీవీ, అలవేల, తదితరులు

# కొత్తగూడెంలో పార్టీ శ్రేణులకు ఎంపీ వద్దిరాజు దిశానిర్దేశం



బీఆర్ఎస్ రోజురోజుకూ మరింత బలోపేతం అవుతుండడాన్ని ఓర్వలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ గద్దెల్ని కూల్చేయమంటూ రాజ్యాంగబద్ధమైన ముఖ్యమంత్రి పదవిలో ఉండి హింసను ప్రోత్సహిస్తున్నట్లుగా మాట్లాడడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఎంపీ రవిచంద్ర కొత్తగూడెం తెలంగాణ భవన్ లో సోమ వారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు,మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పడిన బకాయిల కార్డు (బాకీ కార్డ్)లు, పార్టీ మునిసిపల్ ఎన్నికల స్టిక్కర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల ఇంఛార్జి,ఎంపీ రవిచంద్ర పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ,ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నాయకులు నెరవేర్చడం లేదని ఎంపీ రవి చంద్ర నిశితంగా దుయ్యబట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు 76,000 కోట్లు,ఆడబిడ్డలకు 62,500 కోట్లు,వృద్ధులు, దివ్యాంగులకు 50,000 కోట్ల చొప్పున బకాయి పడిందని ఎంపీ వద్దిరాజు వివరించారు.అదేవిధంగా కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు స్కూటీల పంపిణీ,పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం జాడే లేదన్నారు. కౌలురైతులు, ఆటో కార్మికులు, నిరుద్యోగ యువతకు చేసిన వాగ్దానాలను నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీదరించుకుంటున్నారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.పార్టీ ప్రచురించిన డోర్ స్టిక్కర్లు, బాకీ కార్డులను గడపగడపకు అంటించి,ప్రతి ఓటరుతో మమేకమై కాంగ్రెస్ సర్కార్ తప్పిదాలను వివరిద్దామన్నారు.ఇటీవల రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 40% పైగా సర్పంచులను గెలిపించుకున్నామని,ఈ ఉత్సాహంతో మనమందరం ముందుకు సాగుదామని ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పుడొచ్చినా,ఆ తర్వాత జరిగినా,ఎప్పుడొచ్చినా కూడా మొత్తం 60 డివిజన్లలో బీఆర్ఎస్ విజయఢంకా మోగించడం ఖాయమని ఎంపీ వద్దిరాజు ధీమాగా చెప్పారు.కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా మంది ఉత్సాహంతో ముందుకు వస్తున్నారని, గులాబీ కండువా కప్పుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని ఆయన వివరించారు.పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చే వారంతా పార్టీ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని,సర్వే వివరాల ఆధారంగా అభ్యర్థిత్వం ఖరారు చేయడం జరుగుతుందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.ప్రజలతో నిత్య సంబంధాలు కలిగిన,పలుకుపడి ఉన్న వారికి ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందని,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు నిర్ణయించిన నాయకులకు అభ్యర్థిత్వం లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ లో గ్రూప్ రాజకీయాలకు తావులేదని,వనమా వెంకటేశ్వర రావు,రేగా కాంతారావు, రవిచంద్రలకు ఎలాంటి వ్యక్తిగత ఏజెండా లేదని,అందరూ కూడా పార్టీ అధినేత కేసీఆర్ గ్రూప్ వారేనని స్పష్టం చేశారు.పార్లమెంట్ సమావేశాలు కూడా మొదలవుతున్నందున ముఖ్యమైన సందర్భాల్లో ఒకటి రెండు సార్లు ఢిల్లీ వెళ్లి వస్తానని, 24 గంటలు పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటానని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఈ మునిసిపాలిటీలో తిరిగి గులాబీ జెండా ఏగురవేసేందుకు మనమంతా కూడా మరింత క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుదామని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.పార్టీ నాయకులకు రవిచంద్ర, కాంతారావు, వెంకటేశ్వర రావులు స్టిక్కర్లు, బాకీ కార్డులు,ఓటర్ల జాబితాలు అందజేశారు.ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ", "వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి",' 'జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్", "కారు గుర్తుకే మన ఓటు"అనే నినాదాలు మిన్నంటాయి.

# పాదయాత్ర ప్రారంభించిన బండ్ల గణేష్

**హైదరాబాద్ :** నటుడు, ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ మహా సంకల్పయాత్ర ప్రారంభమైంది. తొలుత వెంకటేశ్వర ఆల యంలో పూజలు నిర్వహించిన ఆయన షాద్ నగర్‌లో ఆయన నివాసం నుంచి తిరుపతి వరకూ పాదయాత్ర ప్రారంభిం చారు. ఆయన సన్నిహితులు, పలువురు సినీ ప్రముఖులు ఆయన వెంట నడిచారు. ఏపీ సీఎం చంద్రబాబుపై అభిమానంతో ఆయన ఈ పాదయాత్ర చేస్తున్నారు.ఏపీ సీఎం చంద్రబాబుపై అభిమానంతో బండ్ల గణేష్ ఈ సంకల్ప యాత్ర చేపట్టారు. స్కిల్ కేసులో అవినీతి జరిగిందనే ఆరోపణలతో వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును అరెస్ట్ చేశారు. ఆ టైంలో బండ్ల గణేష్ తీవ్ర ఆవేదన చెందారు. పలు కార్యక్రమాల్లో చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఆయన ఎలాంటి మచ్చ లేకుండా తిరిగి వస్తే కాలినడకన శ్రీవారి సన్నిధికి వస్తానని మొక్కుకున్నారు. ఇప్పుడు అది నెరవేరడంతో మొక్కు చెల్లించుకుంటున్నారు. అంతకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు హీరో శివాజీ మాట్లాడారు.తాను చేపట్టే సంకల్పయాత్ర రాజకీయ యాత్ర కాదని... దేవుడి మొక్కు అని తెలిపారు బండ్ల గణేష్. 'భగవంతుడు నేను అనుకున్నది నెరవేర్చినందుకు ఆయన మొక్కు చెల్లించుకుంటున్నా. చంద్రబాబుపై అభిమానంతో వెంకన్న కొండకు నడిచివెళు_న్నా. ఓ రోజు ఉదయాన్నే లేచి చూస్తే చంద్రబాబు అరెస్ట్ వార్త విని షాకయ్యా. రోజులు గడుస్తున్నా సార్ బయటకు రాలేదు. ఆయనకు పదవి రావాలనో లేదంటే అధికారంలోకి రావాలనో నేను ఆ వెంకటేశున్ని మొక్కుకోలేదు.ప్రాణాలతో ఆయన బయటకు వస్తే నా గడప నుంచీ నీ గడప వరకూ పాదయాత్రగా వచ్చి నీ మొక్కు చెల్లించుకుంటానని వెంకటేశుని ప్రార్థించా. ఆ ఏడుకొండల వాడి ఆశీస్సులతో చంద్రబాబు బయటకు వచ్చారు. జూలు విడిచిన సింహంలా ఆయన బయటకు వచ్చారు. ఈ యాత్రకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదు. ప్రతీ అభిమాని అడుగు ఇది. కోట్లాది మంది తెలుగు ప్రజల అడుగు ఇది.' అని తెలిపారు.బండ్ల గణేష్ అంటే ఓ శక్తి అని సీనియర్ హీరో శివాజీ అన్నారు. 'బండ్ల గణేష్ అంటే ఓ బ్రాండ్. పరిశ్రమలో నాకు ఫస్ట్ సహాయం చేసింది గణేష్ అన్న. ఆయన ఇండస్ట్రీలో ఎంతోమందికి సహాయం చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆయన అందరివాడు. ప్రజల మనిషి చంద్రబాబు బయటకు రావాలని కోరుకున్నారు. అది నెరవేరడంతో ఇచ్చిన మాట ప్రకారం షాద్ నగర్ నుంచి వెంకన్న సన్నిధి వరకూ పాదయాత్ర చేపట్టారు.' అని అన్నారు



## ఈ నెల 24 న బాలాపూర్ లొఓ ధర్మ రక్షణ సభ

**రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గ్రామంలోని గణేష్ చౌక్ వేదికగా గణేష్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన 'ధర్మ రక్షణ సభ' నిర్వహించనున్నట్లు బాలాపూర్ గ్రామస్తులు ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం బాలాపూర్ లో విలేఖరుల సమా వేశంలో వారు మాట్లాడుతూ... భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మద్దతుతో జరగనున్న ఈ సభలో రోహింగ్యాల వల్ల ఎదురవుతున్న భద్రతా పరమైన సవాళ్లపై గళమెత్తనునున్నట్టు తెలిపారు. స్థానికంగా నివసిస్తున్న రోహింగ్యాలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతు న్నారని, పేలుడు పదార్థాలతో వారికి సంబంధాలు ఉన్నాయనే అనుమానాలపై చర్చించి, హైదరాబాద్లో అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యాలపై రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యను పార్లమెంటులో చర్చించాలని అన్ని రాజకీయ పార్టీలను, అలాగే రోహింగ్యాల వల్ల మైనారిటీ వర్గాలకు కలుగుతున్న ఇబ్బందులను గమనించి వారిపై నిఘా ఉంచాలని ఎంఐఎం నేతలను కూడా కోరనున్నామని, రోహింగ్యాల కారణంగా తమ నిత్యజీవితంలో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని, పనులకు ఆటంకం కలుగుతోందని బాలాపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ సన్నాహక సమావేశంలో బాలాపూర్ గ్రామస్తులు, నాయకులు కోలన్ శంకర్ రెడ్డి, చిగురింత నరసింహారెడ్డి, సింగిరెడ్డి పెంటారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, గుండుజి రఘునందన్ చారి, పోరేటి శ్రీనివాస్ రెడ్డి, బాల్లింగని జంగయ్య, నవారు శ్రీనివాస్ రెడ్డి, బోర్ర రవి, మేకల సంజీవ, గిరికటి కృష్ణంరాజు గౌడ్, కొంతం ప్రకాశ్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, కోటగిరి మురళి, కళ్లెం లక్ష్మారెడ్డి, ఇక శ్రీను, దొడ్డి శ్రీశైలం, మైపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలు హిందూ సంఘాల ప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు ఈ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు..

## ప్రజలకు అందుబాటులో పోలీస్ శాఖ

**జిల్లా ఎస్పీ డి. జానకి,**

**మహబూబ్నగర్ :** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి పాల్గొని ప్రజల నుండి పిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలు, భూ వివాదాలు, కుటుంబ వివాదాలు, పోలీసు సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ కి నేరుగా విన్నవించారు. ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకున్నారు. అనంతరం ఆయా పిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ఇన్స్పెక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ముఖ్యమైన కేసుల విషయంలో సంబంధిత ఎస్హెచ్ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా, భయభ్రాంతులు లేకుండా ప్రజలు తమ సమస్యలను వెల్లడించాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## కంటోన్మెంట్ బోర్డు రాష్ట్ర మున్సిపల్ కార్పోరేషన్‌లో విలీనమే లక్ష్యంగా రిలే నిరహార దీక్ష

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నో ఏళ్ల నుంచి ఎన్నికలు నిర్వహించకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరోధకులుగా మారిన కేంద్రం లోని బిజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా,కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలనే డిమాండ్ తో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ రేపటి నుంచి కార్ఖానా లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద చేపట్టనున్న రిలే నిరహార దీక్ష గోడ పత్రిక ( పోస్టర్) ను కాంగ్రెస్ పార్టీ నాయకులతో సోమవారం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు . అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దిగివచ్చి కంటోన్మెంట్ బోర్డును మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేసేంతవరకు ఈ పోరాటం ఆగదని, అవసరమైతే ఢిల్లీ స్థాయిలో కూడా పోరాటం చేస్తామని, కంటోన్మెంట్ ప్రజల కష్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గుర్తించి కంటోన్మెంట్ బోర్డును విలీనం చేసేంతవరకు నా ఈ పోరాటం ఉంటుందని, నా జీవితం కంటోన్మెంట్ ప్రజల అభ్యున్నతికే అంకితమని అన్నారు .

## నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలలో ప్రజా సమస్యలు పరిష్కరించడమే దయంగా పనిచేయాలి.

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి.**



**వనపర్తి :** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల్లో బాధ్యత యుతంగా మెలిగి ప్రజల సమస్యలు తీర్చడమే లక్ష్యంగా పని చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు...( నేడే సోమవారం) వనపర్తి మండలం రాజపేట శివారులో ఉన్న వైటీసీ భవనంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు5 రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చెయ్యగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరుఐ ప్రసంగించారు. ముందుగా కలెక్టర్ నూతన ఎన్నికైన సర్పంచులు అందరికీ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ శిక్షణ శిబిరాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టంలో అన్ని కీలక అంశాలను సర్పంచ్ లు శిక్షణలో తెలుసుకోవాలని సూచించారు. సర్పంచులు పదవి సర్పంచులు పదవి కాలం ఐదు సంవత్సరాలు ఉంటుందని అన్నారు. ఈ ఐదు సంవత్సరాలు బాధ్యతంగా పని చేయాలి. కలెక్టర్ ఆదర్శ సురభి నూతన సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీ చట్టం కరదీపికను చేతుల మీదుగా అందజేశారు చిత్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. వనపర్తి జిల్లా డిపిఓ అరుణ్. డి ఎల్ పి ఓ రఘునాథ్. వివిధ మండలాల ఎంపీడీవోలు. పంచాయతీ కార్యదర్శులు. సర్పంచులు. తదితరులు ఉన్నారు.

## కన్న తండ్రిని ఇంట్లోంచి గెంటేసిన కొడుకు

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన ఎదులాపురం దామోదర్( 62 )ఏళ్ల వృద్ధ తండ్రిని కొడుకు సంతోష్ ఇంట్లోంచి నెల రోజుల కింద గెంటి వేయగా అప్పటినుండి బయటనే ఉంటూ, పడుకుంటూ ఎవరైనా అన్నం పెడితే తింటూ, లేని నాడు పస్తులుంటూ దయనీయంగా జీవిస్తున్నాడు. కాగా సోమవారం ఉదయం జగిత్యాల జిల్లా కేంద్రనికి వచ్చి సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు.సోమవారం ఆ వృద్ధ తండ్రి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో విలేకరులకు తన గోడు వినిపించారు.సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆ కొడుకు కు ఫోన్ చేసినా స్పందించక పోవడం తో హరి అశోక్ కుమార్ సాయం తో ఆర్డీవో మధుసూదన్ కు ఫిర్యాదు చేయగా వయో వృద్ధుల పోషణ చట్టం కింద కేసు నమోదు చేశారని, అనంతరం ఎస్పీ దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేయగా మల్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ఎస్పీ ఫోన్ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని ఆ వృద్ధ తండ్రి తెలిపాడు.ఆ తండ్రి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కార్యదర్శి గౌరీశెట్టి విశ్వనాతం, ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, ప్రకాష్ రావు, బ్రహ్మయ్య, సంజీవ రావు తదితరులున్నారు.

## బిజినెస్

# 5 త్రైమాసికాల గరిష్ఠానికి సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ

వరుసగా మూడో త్రైమాసికంలో (అక్టోబరు-డిసెంబరు)నూ సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ (బీసీఐ) పెరిగిందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలిపింది. గిరాకీ, లాభదాయకత, పెట్టుబడి పరిస్థితుల్లో ఉన్న ఆశావాదం కారణంగా బీసీఐ 66.5కు చేరిందని, ఇది 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి అని పేర్కొంది. దేశీయంగా లభిస్తున్న గిరాకీ కీలకమైన చోదక శక్తిగా ఉందని.. మూడింట రెండొంతుల సంస్థలు 2025-26 జులై-సెప్టెంబరులో అధిక డిమాండ్‌ను నివేదించాయని సీఐఐ వెల్లడించింది. మూడో త్రైమాసికంలో మరింత వృద్ధి లభించిందని 72% సంస్థలు పేర్కొన్నాయి. జీఎస్‌టీ రేట్లు తగ్గించడం, పండగ వినియోగం పెరగడం.. గిరాకీ వృద్ధికి దోహదపడతాయని తెలిపింది. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద సంస్థలతో పాటు అన్ని పరిశ్రమల రంగాల అభిప్రాయాలను సేకరించి, ఈ అభిప్రాయానికి సీఐఐ వచ్చింది. తయారీ, సేవల్లో నిమగ్నమైన ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని 175 సంస్థల నిర్వాహకుల వద్ద 2025 డిసెంబరు తొలి - మూడో వారం మధ్య అభిప్రాయాలు సేకరించారు. కొత్త పెట్టుబడులు, కొత్త ఉద్యోగ నియామకాలపైనా ఆశావాదం బలంగా ఉన్నట్లు తేలింది. ప్రస్తుత త్రైమాసికంలో రెపోరేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరింత తగ్గిస్తుందని 69% సంస్థలు ఆశిస్తున్నాయి. దేశ వృద్ధిరేటును ఉపకరించేలా




రాబోయే బడ్జెట్‌లో సంస్కరణల వేగం కొనసాగుతుందని సీఐఐ విశ్వాసం వ్యక్తం చేసింది. సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ కోతల వల్ల విక్రయాలకు ఊతం లభించింది. రాబోయే త్రైమాసికాల్లో తమ విక్రయాలు 5 - 20% పెరుగుతాయని 56.3% సంస్థలు ఆశాభావంతో ఉన్నాయి. సాహసోపేత సంస్కరణల చొరవతో, మన దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా స్థిరపడిందని సర్వే తేల్చింది.

## సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!



వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది. గత ఏడాది ఏప్రిల్ లో రూ. 95,917గా ఉన్న ధర, అప్పటి నుంచి దాదాపు 200 శాతం పెరగడం గమనార్హం. సాధారణంగా మల్టీబ్యాగర్ స్టాక్స్ లో కనిపించే ఈ తరహా రాబడి, కమోడిటీలో నమోదు కావడం విశేషం. గత వారమే కిలో వెండి రూ. 2,92,960 వద్ద సరికొత్త రికార్డును సృష్టించింది.వెండి ధరకు ఇంతటి డిమాండ్ రావడానికి పలు అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేసిన ప్రపంచ కేంద్ర బ్యాంకులు, ఇప్పుడు తమ నిల్వల్లోకి వెండిని కూడా చేర్చుకుంటున్నట్లు వస్తున్న నివేదికలు ధరలకు మరింత ఊతమిస్తున్నాయి. దీనికి తోడు, మార్కెట్లో భౌతిక వెండి నిల్వలు తగ్గడం కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా నిలుస్తోంది. నిజానికి, 2025 ప్రారంభంలో వెండిపై పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. గత ఏడాది చివరి నాటికి వెండి ధర రూ. 1,10,000 చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేయగా, ఆ మార్కును చాలా ముందే దాటేసింది. ఆ తర్వాత కూడా ఆగకుండా రూ.2,54,000 స్థాయిని తాకి, అంచనాలను తలకిందులు చేసింది. ప్రస్తుత ముగింపు ధర ప్రకారం చూస్తే? రూ.3 లక్షల మైలురాయిని దాటడానికి వెండికి కేవలం 4.2 శాతం పెరుగుదల మాత్రమే అవసరం. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల దఅష్టి ఇప్పుడు పూర్తిగా వెండిపైనే కేంద్రీకృతమై ఉంది.

## భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం



అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూఈఎఫ్ సమావేశాల్లో భారత్‌కు సంబంధించి ఇది కీలకమైన చర్చనీయాంశం కానుంది. '2028 నాటికే ఈ మైలురాయిని చేరుకోవడానికి వృద్ధిని మరింత వేగవంతం చేయొచ్చా అనేది ముఖ్యమైన ప్రశ్న. ఇందుకోసం ప్రస్తుతం జీడీపీలో 15-17 శాతంగా ఉన్న తయారీ రంగాన్ని, 20% లేదా అంతకంటే ఎక్కువకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఈ లక్ష్యాన్ని సాధించడం ఎప్పుడూ అనే ప్రస్తావన ఉండదు' అని జైన్ పేర్కొన్నారు. శుద్ధ ఇంధనం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు వంటి వర్ధమాన రంగాల్లో పెట్టుబడులతో భారత్‌లో కొత్త వృద్ధి అవకాశాలు సృష్టించొచ్చని జైన్ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, వాహన విడిభాగాలు, పునరుత్పాదక ఇంధన, హార్డ్‌వేర్, డేటా కేంద్రాలు, సెమీకండక్టర్ వ్యవస్థలను విస్తరించడం ద్వారా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ మరింత చొచ్చుకువెళ్లొచ్చని అంచనా వేశారు.

# టెక్ రంగంలో ఈ ఏడాది 1.25 లక్షల ఉద్యోగాలు

ఈ ఏడాది దేశీయ టెక్ రంగంలో భారీ నియామకాలు జరగనున్నాయి. 2026లో దాదాపు 1,25,000 కొత్త ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా, సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాలను అత్యధిక గిరాకీ ఉంటుందని హెచ్‌ఆర్ సొల్యూషన్స్ సంస్థ అడెక్కొ ఇండియా నివేదిక తాజా ప్రకటనలో వెల్లడించింది. ఈ ఉద్యోగాలు ప్రయోగాత్మక దశ నుంచి ప్రధాన అవసరాల దశకు చేరాయని నివేదిక అభిప్రాయపడింది. ఫలితంగా ఈ ఉద్యోగాలకు గిరాకీ కూడా 51 శాతం పెరిగింది. దీనివల్ల ఈ ఏడాది ఉద్యోగాలు 12-15 శాతం పెరుగుతాయని అంచనా. దాదాపు 40 శాతం దిగ్గజ సంస్థలు ఇప్పటికే రోజువారీ పనిలో జనరేటివ్ ఏఐని ఉపయోగిస్తున్నాయి. 2023, 2024లలో నెమ్మదించిన తర్వాత 2025లో ఐటీ, ఐటీ సేవల రంగంలో నియామకాలు రికవరీ అవుతున్నాయని అడెక్కొ ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప అన్నారు. కంపెనీలు ఇప్పుడు మళ్ళీ నియామక ప్రక్రియను మొదలుపెట్టాయి. ముఖ్యంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా, ఆధునిక ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించిన నైపుణ్యాల కోసం ఉద్యోగులను తీసుకుంటున్నాయి. కొత్త గ్రాడ్యుయేట్ల నియామకం కూడా పెరిగింది. దీనర్థం ఐటీ రంగం నెమ్మదిగా



కోలుకుంటోందని, 2026లో మరింత బలంగా పుంజుకోగలదని నివేదిక తెలిపింది. భారతీయ ఐటీ కంపెనీల్లో అగ్రశ్రేణి కంపెనీలు ఫ్రెషర్లు, స్కిల్స్ ఉన్న నిపుణులను తీసుకోవడం కొనసాగిస్తామని చెప్పాయి. ఇటీవల డిసెంబర్ త్రైమాసికంలో ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ 5,043 మంది ఉద్యోగులను, విప్రో 6,529 మంది ఉద్యోగులను చేర్చుకుంది. కంపెనీలు ఉద్యోగులకు ఏఐ, భవిష్యత్తు సాంకేతికతలలో శిక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తున్నాయి. 2,17,000 మంది ఉద్యోగులు ఇప్పుడు అధునాతన ఏఐ స్కిల్స్ కలిగి ఉన్నారని, ఇది గతేడాది కంటే మూడు రెట్లు ఎక్కువ అని టీసీఎస్ వెల్లడించింది. ఏఐ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తోందని, ఏఐపై ఎక్కువ దృష్టి పెట్టడానికి కంపెనీ తన జాబ్ స్ట్రక్చర్‌నే మారుస్తున్నట్టు పేర్కొంది.

# భారత్‌లో ఆడకుంటే వేటు తథ్యం..

## బంగ్లాదేశ్‌ను హెచ్చరించిన ఐసీసీ..!

పురుషుల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ మార్చాలని పట్టుపట్టిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఆ బోర్డు ప్రతిపాదించిన 'గ్రూప్ స్వాపింగ్‌కు' అంగీకరించమని క్రికెట్ ఐర్లాండ్ స్పష్టం చేయడమే ఆలస్యం.. భారత్‌లోనే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆదేశించింది. కాదు.. కుదరదు అని బెట్టు చేస్తే కొత్త జట్టుకు అవకాశమిస్తామని బంగ్లా బోర్డును ఐసీసీ హెచ్చరించింది. అంతేకాదు ఆడుతారా? టోర్నీ నుంచి తప్పించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోవాలని అల్టిమేటం జారీ చేసింది. భద్రతా కారణాలరీత్యా భారత్‌లో ప్రపంచకప్ ఆడకుండా ఉండేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(దీజదీ) చేస్తున్న ప్రయత్నాలు అన్నీ బెడిసి కొడుతున్నాయి. ఒక్కొక్కటిగా బంగ్లా బోర్డుకు అన్ని దారులు మూసుకుపోతున్నాయి. గ్రూప్ స్వాపింగ్ చేయాలని ఐసీసీకి విన్నవించుకున్నా నిరాశే ఎదురైంది. ఎందుకంటే.. తమను గ్రూప్ బీలోకి మార్చాలని అభ్యర్థించిన బంగ్లాదేశ్ ఆశలపై క్రికెట్ ఐర్లాండ్ (జతీఅఏఎవ్ ×తీవశ్రీఖఅఎ) నీళ్లు చల్లింది. ఎట్టిపరిస్థితుల్లోనూ గ్రూప్ మారబోమని, శ్రీలంకలోనే తాము ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతామని ఆదివారం ఐర్లాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లా బోర్డుకు మరో అవకాశమిచ్చింది ఐసీసీ. భారత్‌లోనే ప్రపంచకప్ ఆడాలని బంగ్లాకు స్పష్టం చేసింది. అందుకు అంగీకరించకుంటే.. ఏకంగా టోర్నీ నుంచే తప్పిస్తామని ఆ దేశ బోర్డును ఐసీసీ హెచ్చరించింది. మంకుపట్టు వదిలేసి ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత్‌లో ఆడుతారా? టోర్నీ నుంచి తొలగించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోండి. జనవరి 21 వరకూ మీ నిర్ణయాన్ని తెలియజేయాలని బంగ్లా బోర్డుకు స్పష్టం చేసింది ఐసీసీ. దాంతో.. మేకపోతు గాంభీర్యం



ప్రదర్శిస్తున్న బీసీబీ సభ్యులు 'అయ్యో.. ఇలా జరిగిందేంటీ?' అని తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ ఐసీసీ హెచ్చరికను బంగ్లాబోర్డు బేఖాతరు చేస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం దక్కనుందని సమాచారం.

### నచ్చజెప్పాలని చూసినా..

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. శనివారం ఐసీసీ ప్రతినిధులు ఢాకాలో బంగ్లాదేశ్ బోర్డు సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్‌లో ఆడకూడదనే నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని ఐసీసీ బృందం నచ్చజెప్పాలని చూసింది. కానీ, బంగ్లా బోర్డు మెంబర్స్ మాత్రం అందుకు అంగీకరించలేదు. శ్రీలంకలో ఆడేందుకు వీలు కల్పించేలా తమ జట్టును గ్రూప్ సీ నుంచి గ్రూప్ బీలోకి మార్చాలని ఐసీసీ సభ్యులను వారు కోరారు. పొట్టి ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకారం ప్రస్తుతం గ్రూప్ 'సీ'లో ఉన్న బంగ్లాదేశ్ లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు కోల్‌కతాలో ఆడాల్సి ఉంది. నాలుగో మ్యాచ్ ముంబైలో ఉంది. ఇక గ్రూప్ 'బీ'లోని ఐర్లాండ్ కొలంబోలో గ్రూప్ దశ మ్యాచ్‌లు ఆడనుంది.

## భారత జెర్సీలో మళ్లీ రో-కోలు కనిపించేది ఎప్పుడంటే?

టీమిండియా స్టార్ జోడీ విరాట్ కోహ్లి-రోహిత్ శర్మల ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ముగియడంతో రో-కో ద్వయం దాదాపు 6 నెలల పాటు భారత జెర్సీలో కన్పించరు. మళ్లీ వచ్చే ఏడాది జూలైలో ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో వీరిద్దరూ భారత్ తరపున ఆడనున్నారు. అంతకంటే ముందు జూన్‌లో అఫ్గానిస్తాన్ జట్టు మూడు వన్డేల సిరీస్ కోసం భారత పర్యటనకు రావాల్సి ఉంది. కానీ ఈ ద్వైపాక్షిక సిరీస్ ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. ఒకవేళ అఫ్గానిస్తాన్‌తో భారత్ ఆడితే విరాట్-రోహిత్ కూడా బరిలోకి దిగనున్నారు. లేదంటే ఆ తర్వాత నెలలో ఇంగ్లండ్‌పై కచ్చితంగా ఆడనున్నారు. కాగా ఇప్పటికే టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, కోహ్లిలు.. ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. ఇప్పుడు న్యూజిలాండ్‌తో వన్డేల తర్వాత టీమిండియా టీ20



సిరీస్‌లు ఎక్కువగా ఆడనుంది. వీరిద్దరూ టీ20లకు వీడ్కోలు పలకడంతో వన్డే సిరీస్ షెడ్యూల్ వరకు అభిమానులు ఆగాల్సిందే. అయితే ఈ సీనియర్ ప్లేయర్లు ఐపీఎల్‌లో మాత్రం తమ తమ జట్లు తరపున సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆఖరిలో మాత్రం విరాట్, రోహిత్ వరుస అంతర్జాతీయ సిరీస్‌లలో బిజీబిజీగా గడపనున్నారు. ఇంగ్లండ్‌తో వన్డేలు ముగిసిన తర్వాత సెప్టెంబర్‌లో భారత్ వెస్టిండీస్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనలో ఆతిథ్య విండీస్‌తో మెన్ ఇన్ బ్లూ 3 వన్డేలు ఆడనుంది. అనంతరం అక్టోబర్-నవంబర్ నెలల్లో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది.

## స్పోర్ట్స్

## ఐపీఎల్‌ను కాపీ కొడుతూ.. తొలిసారి ఆటగాళ్ల వేలానికి శ్రీకారం..!




టీ20 క్రికెట్‌లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ పలు దేశాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఆదరణ పెరగడంతో అందరూ ఐపీఎల్ తరహాలోనే వేలాన్ని నిర్వహిస్తున్నాయి. ఇప్పుడు పాకిస్థాన్ సూపర్ లీగ్ (ఞూూ) కూడా మన ఐపీఎల్‌నే కాపీ కొడుతోంది. ఇన్నాళ్లుగా అనుసరిస్తున్న లాటరీ (డ్రాఫ్ట్) విధానానికి స్వస్తి పలికి.. వేలం ప్రక్రియకు నాంది పలుకనుంది. వచ్చే సీజన్ నుంచే యాక్షన్ ద్వారా ఆటగాళ్లను కొనే పద్ధతిని పీసీబీ అనుసరించనుంది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లోని ఫ్రాంచైజీలు ఇప్పటివరకూ ఆటగాళ్లను లాటరీ విధానం(డ్రాఫ్ట్)లో తీసుకునేవి. 2016లో లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే పద్ధతిని పాటిస్తున్నాయి. ఇకపై వేలం ద్వారా క్రికెటర్లను కొనబోతున్నాయి.వచ్చే పదకొండో సీజన్ నుంచి పీఎస్ఎల్ సరికొత్తగా ఉండనుందని సోమవారం పీఎస్ఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సల్మాన్ నసీర్ వెల్లడించాడు. 'పీఎస్ఎల్‌లో భారీ మార్పు రాబోతోంది. ఇన్నాళ్లు లాటరీ ద్వారా ఆటగాళ్లను తీసుకునేవాళ్లం. ఇకపై వేలం విధానాన్ని అనుసరించబోతున్నాం. ఫలితంగా పారదర్శకతతో పాటు పోటీతత్వం కూడా పెరుగుతుంది' అని సల్మాన్ నసీర్ తెలిపాడు. అంతేకాదు 1.3 మిలియన్ యూఎస్ డాలర్లుగా ఉన్న ఫ్రాంచైజీల పర్స్‌ను 1.6 మిలియన్ యూఎస్ డాలర్లకు పెంచుతున్నామని ఆయన వెల్లడించాడు.

### నలుగురికి ఛాన్స్..

ఐపీఎల్ తరహాలో వేలం ద్వారా ఆటగాళ్లను కొనే ప్రక్రియకు పచ్చజెండా ఊపిన నిర్వాహకులు.. ఎంతమందిని అట్టిపెట్టుకోవాలనే విషయంపైనా కసరత్తు చేశారు. ప్రతి ఫ్రాంచైజీ గరిష్టంగా నలుగురిని రీటైన్ చేసుకునేందుకు అనుమతించారు. ఇంతకుముందు ఎనిమిది మందిని అట్టిపెట్టుకునే వీలుండేది. అంతేకాదు.. మెంటర్, బ్రాండ్ అంబాసిడర్, రైట్ టు మ్యాచ్ నిబంధనలను కూడా రద్దు చేసింది. మార్చి 26వ తేదీ నుంచి పీఎస్ఎల్ పదకొండో సీజన్ షురూ కానుంది. ఆలోపే వేలం ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం ఈ లీగ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ క్యాలండర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్ జట్లు పాల్గొంటున్నాయి.

ధర్మఘంట



# శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి టీం నుంచి మరో క్రేజీ న్యూస్

టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ ప్రాజెక్ట్ నారీ నారీ నడుమ మురారి సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్, ఏజెంట్ ఫేం సాక్షి వైద్య ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. పండుగ మొదలయింది అంటూ మేకర్స్ మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. అద్భుతమైన ఓపెనింగ్ వీక్ తర్వాత ప్రేక్షకులను వస్తున్న డిమాండ్ నేపథ్యంలో మరిన్ని థియేటర్లతో మీ ముందుకు వస్తోంది అంటూ కొత్త లుక్ విడుదల చేశారు. ఇంకేంటి మరి సంక్రాంతి విన్నర్‌గా నిలిచిన ఈ చిత్రంపై మీరూ ఓ లుక్కేయండి. ఈ సంక్రాంతికి అసలైన పండుగ ఆఫర్.. ఎంఆర్‌పీ ధరలకే టికెట్లు.. అదనపు ఛార్జీలు ఏం లేవు.. అంటూ శర్వానంద్ టీం ప్రమోషనల్ స్ట్రాటజీ పర్‌ఫెక్ట్‌గా వర్కవుట్ అయినట్టు ఇప్పటివరకు వచ్చిన అప్‌డేట్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఆటోడ్రైవరైన కమెడియన్ సత్య ఓ మహిళను ఆస్పత్రికి తీసుకొచ్చిజాగ్రత్త దింపేసి వెళ్లే క్రమంలో.. ఆ మహిళ డబ్బులు తీసుకో బాబు అని అంటే.. అయ్యో వద్దమ్మా గర్భిణీ స్త్రీల దగ్గర డబ్బులు తీసుకోనమ్మా సత్య అంటాడు. నేను ప్రెగ్నెంట్ కాదు అని ఆ మహిళ అనే ఫన్నీ సన్నివేశంతో షురూ అయింది ట్రైలర్. ఆ తర్వాత బీటెక్ చదివి ఆర్కిటెక్ట్‌గా పనిచేసే క్రమంలో శర్వానంద్‌కు సంయుక్తా మీనన్, సాక్షి వైద్య కలుస్తారు. ఇద్దరి మధ్య ఎలా నలిగిపోతాడనే నేపథ్యంలో ఎంటర్‌టైనింగ్‌గా సాగే ఈ సినిమాను మూవీ లవర్స్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ మూవీకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ ప్రాజెక్ట్‌ను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర తెరకెక్కించారు.



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న మెగాస్టార్ సినిమా..

## తొలి వారం రూ.292 కోట్ల వసూళ్లతో సంచలనం

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'మన శంకర వరప్రసాద్ గారు' (మీ+) బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా ఆకట్టుకునేలా రూపొందిన ఈ చిత్రం విడుదలైనప్పటి నుంచే హౌస్‌ఫుల్ షోలను నమోదు చేస్తూ, అద్భుతమైన వసూళ్లతో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా మొదటి వారం పూర్తయ్యే సరికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.292 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఇదే జోరు కొనసాగితే, అతి త్వరలోనే రూ.300 కోట్ల క్లబ్‌లోకి ఈ చిత్రం అడుగుపెట్టడం ఖాయమని అంటున్నారు. ఈ స్థాయి వసూళ్లతో 2026 సంవత్సరానికి టాలీవుడ్‌కు అదిరిపోయే ఆరంభం లభించినట్టైంది. సంక్రాంతి బరిలో విడుదలైన ఇతర చిత్రాలతో పోలిస్తే, 'మన శంకర వరప్రసాద్ గారు' స్పష్టమైన ఆధిక్యంతో ముందంజలో నిలిచింది. బలమైన కథనం, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ టైమింగ్, చిరంజీవి వింటేజ్ స్టైల్ నటన సినిమాకు ప్రధాన బలంగా మారాయి. పైగా రాబోయే వారం రోజుల పాటు పెద్దగా పోటీ లేకపోవడంతో, వసూళ్లు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోగా, నయనతార కథానాయికగా తనదైన ఆకర్షణతో కీలక పాత్ర పోషించింది. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు పెద్ద ఎత్తున రావడంతో పాటు, అన్ని వయసుల ప్రేక్షకులకు నచ్చే అంశాలు సినిమాలో పుష్కలంగా ఉన్నాయి. కామెడీ, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్‌ను సమతూకంగా మేళవించిన విధానం సినిమాకు ప్లస్ అయింది. సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా, వాణిజ్యపరంగా నిర్మాతలకు భారీ లాభాలను అందిస్తోంది. కలెక్షన్ల జోరు కొనసాగుతుండటంతో, మేకర్స్ ఇంకా బలమైన ప్రమోషన్లను ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాబోయే రోజుల్లో సినిమా మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో మరో బ్లాక్‌బస్టర్‌గా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలిచింది. బాక్సాఫీస్ వద్ద కొనసాగుతున్న ఈ ప్రభంజనం, ఈ ఏడాది టాలీవుడ్‌కు గోల్డెన్ స్టార్ట్‌గా మారిందని చెప్పొచ్చు.

# రికార్డు స్థాయిలో థియేటర్ విడుదలకు 'త్రిముఖ' రెడీ

ఈనెల 30వ తేదీన థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న తెలుగు సినిమా 'త్రిముఖ'. ఇది ఇప్పుడు విడుదలకు ముందే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ మైలురాయిని నమోదు చేయబోతోంది. ఈ చిత్రాన్ని కొత్త హీరోతో తీశారు. అయినా సరే అత్యధికంగా 500 థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే మంచి బజ్ సొంతం చేసుకున్న 'త్రిముఖ'... ప్రేక్షకుల అంచనాలను మించేలా బాక్సాఫీస్ వద్ద ప్రభావవంతమైన విజయాన్ని నమోదు చేస్తూ.. ఒక కొత్త హీరోకు ఘనమైన ఆరంభాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంది. ఇందులో సన్నీ లియోన్, అషూ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు.






# పూజాని ఇబ్బంది పెట్టిన పాన్ ఇండియా హీరో ఎవరు?

హీరోయిన్ పూజా హెగ్డేకి అవకాశాలు దాదాపు తగ్గిపోయాయి. ఈమె నటించిన 'జన నాయగణ్' లెక్క ప్రకారం ఈ పాటికే సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి వచ్చేయాలి. కానీ సెన్సార్ సమస్యల వల్ల అది ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. ఇలాంటి టైంలో పూజా హెగ్డే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిపోయింది. దానికి కారణం ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలు. పాన్ ఇండియా హీరో తనతో అసభ్యంగా ప్రవర్తిస్తే, అతడిని లాగిపెట్టి కొట్టానని చెప్పింది. ఇంతకీ ఏంటి విషయం? తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన పూజా హెగ్డే.. ఓ స్టార్ హీరోతో తనకెదురైన ఓ చేదు అనుభవాన్ని బయటపెట్టింది. 'నా కెరీర్ మొదట్లో ఓ భారీ పాన్ ఇండియా సినిమాలో ఛాన్స్ వచ్చింది. చాలా సంతోషంగా అనిపించింది. కానీ షూటింగ్ టైంలో ఓ రోజు.. ఆ హీరో, అనుమతి లేకుండా నా క్యారవాన్‌లోకి వచ్చేశాడు. అసభ్యంగానూ ప్రవర్తించాడు. చాలా ఇబ్బందిగా అనిపించింది. ఏం చేయాలో అర్థం కాలేదు. దీంతో ఆ హీరోని లాగిపెట్టి కొట్టాను. వెంటనే సదరు హీరో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత ఆ హీరోతో నటించడానికి నేను ఇష్టపడలేదు. దీంతో నా సీన్స్ అన్నీ డూపుని పెట్టి తీశారు' అని పూజ చెప్పుకొచ్చింది. మరి పూజా హెగ్డేని ఇబ్బంది పెట్టిన ఆ పాన్ ఇండియా హీరో ఎవరా అనేది ఇక్కడ క్వశ్చన్ మార్క్. కెరీర్ ప్రారంభంలో అంటే హృతిక్ రోషన్ 'మొహంజదారో'లో ఈమె నటించింది. దక్షిణాదిలోనూ ఈ మూవీ రిలీజైంది. నాలుగేళ్ల క్రితం ప్రభాస్ 'రాధేశ్యామ్'లో నటించింది. పూజా చేసిన పాన్ ఇండియా మూవీస్ అంటే ఇవే. మరి వీరిద్దరిలో ఎవరైనా పూజతో అసభ్యంగా ప్రవర్తించారా? లేదంటే ఈమె ఏమైనా కట్టుకథ చెబుతోందా అనేది ఇక్కడ అర్థం కావట్లేదు. ఇకపోతే పూజా చేతిలో ప్రస్తుతం కాంచన 4, దుల్కర్ సల్మాన్ తెలుగు సినిమా, ఓ హిందీ మూవీ ఉన్నాయి.



# టీవీ ప్రీమియర్‌కు సిద్ధమైన బ్లాక్‌బస్టర్ 'మిరాయ్'డ ఈ నెలలోనే స్టార్ మా లో సందడి

యంగ్ హీరో తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన భారీ విజువల్ ఫాంటసీ యాక్షన్ మూవీ 'మిరాయ్' విడుదలైనప్పటి నుంచి సంచలన విజయాన్ని నమోదు చేసింది. థియేటర్లలో భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించి, తేజ సజ్జా కెరీర్‌లోనే మరో మైలురాయిగా నిలిచింది. థియేట్రికల్ రన్ తర్వాత ఓటీటీలో కూడా మంచి రెస్పాన్స్ దక్కించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు టెలివిజన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. తాజాగా 'మిరాయ్' టెలివిజన్ ప్రీమియర్ డేట్ ఫిక్స్ కావడంతో ఈ సినిమా మళ్లీ వార్తల్లో నిలిచింది. ఈ చిత్రం జనవరి 25, 2026న సాయంత్రం 5:30 గంటలకు స్టార్ మా ఛానెల్‌లో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం కానుంది. ఇప్పటివరకు థియేటర్, ఓటీటీలో మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, బుల్లితెరపై ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో అన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఈ సినిమా, కథనం నుంచి టెక్నికల్ విలువల వరకు అన్ని విభాగాల్లోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా సూపర్ యోధుడి పాత్రలో తేజ సజ్జా పర్ఫార్మెన్స్, అతడి బాడీ లాంగ్వేజ్, యాక్షన్ సీక్వెన్సులు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. అంతేకాదు, భారీ విజువల్ గ్రాండియర్, వీఎఫ్ఎక్స్ పనితనం కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షించాయి. ఈ చిత్రంలో మంచు మనోజ్ కీలక పాత్రలో నటించి విలన్‌గా సాలిడ్ ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. ఆయన పాత్రకు థియేటర్లలోనే కాకుండా ఓటీటీలో కూడా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. హీరోయిన్‌గా రితికా నాయక్ నటన ఆకట్టుకోగా, కథకు తగిన భావోద్వేగాలను అందించింది. సంగీత దర్శకుడు గౌర హరి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి.మొత్తంగా చూస్తే, భారీ యాక్షన్, ఫాంటసీ ఎలిమెంట్స్‌తో రూపొందిన 'మిరాయ్' ఇప్పుడు బుల్లితెరపై మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్ మిస్ అయిన వారు, అలాగే కుటుంబంతో కలిసి మళ్లీ చూడాలనుకునే ప్రేక్షకులకు ఇది మంచి అవకాశం అనే చెప్పాలి.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# పర్యావరణ అనుకూల అభివృద్ధికి కళాశాలలు, విద్యార్థులు






**ధర్మ ఘంట జనవరి19, హైదరాబాద్ :** వాతావరణ మార్పు దుష్పరిణామాల దృష్ట్యా నేటి యువత పర్యావరణ పరిరక్షణ స్పృహ పెంచుకునేలా వారి ఆలోచనాసరళిని బోధకులు మార్చాలని నిపుణులు పిలుపునిచ్చారు. చదువుకునే యువత చెడుదారి పట్టకుండా తీర్చిదిద్దే గొప్ప అవకాశం టీచర్లకుందని వారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 149 డిగ్రీ కళాశాల అధ్యాపకులకు వాతావరణ మార్పులు, పర్యావరణ సుస్థిరత అనే అంశంపై అవగాహన సదస్సు నేడు ప్రారంభమైంది. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ మరియు తెలంగాణ ఉన్నత విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ది ఎర్త్ సెంటర్ అన్మాస్ పల్లి, కడ్తల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల చెందిన సుమారు 100 మందికి పైగా అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేశ్వర్ తివారి విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ తెలంగాణ ప్రభుత్వం వారు మాట్లాడుతూ...

స్థానిక పర్యావరణ అంశాలపై కళాశాలలు కృషి చేస్తూ ప్రపంచ సుస్థిరతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఇందుకు కళాశాలలు కృషి చేయాలని సూచించారు.

ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ సుస్థిర కొరకు పర్యావరణ అనుకూల అభివృద్ధికి కళాశాలలు,కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.మాజీ సమాచార కమిషనర్ శ్రీ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ స్వాగతోపన్యాసం ఇవ్వడం జరిగింది. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీ డాక్టర్ డిఎస్ఆర్ రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ పర్యావరణ కార్యక్రమాలు కళాశాలలో చేపట్టాలని ఇందుకు ఉన్నత విద్యాశాఖ తోడ్పడుతుందని పేర్కొన్నారు.

సి జి ఆర్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ కోర్పోలు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశ భద్రత ఎంత ముఖ్యమో పర్యావరణ పరిరక్షణ అంతే ముఖ్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ సాయి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ చర్చలు, సమావేశాలు కార్యరూపం దాల్చడం ముఖ్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా మ మల్కాజ్గిరి డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ , డాక్టర్ వసంతలక్ష్మి, డాక్టర్ పియా కుమారి సభ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి జి ఆర్ సంస్థ సభ్యులు పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ జెపిస్సార్ అన్నమయ్య, ప్రసన్న, హరిత దేవి, కోటయ్య,నాగేష్, రజనీకాంత్, సాత్విక, మద్దిలేటి,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 23న జరిగే టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా 4వ మహాసభను విజయవంతం చేయండి - ముమ్మరంగా కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

**ధర్మఘంట,కోదాడ,జనవరి19:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) సూర్యాపేట జిల్లా అడ్ హక్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23 జరుగనున్న జిల్లా నాల్గవ మహాసభను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా జర్నలిస్టుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం తుంగతుర్తి, హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్ పాల్వాయి జానయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ... సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఈనెల 23న జరగబోయే సూర్యాపేట జిల్లా నాలుగో మహాసభను జర్నలిస్టులందరూ విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజలకు



మధ్య వారధులుగా ఉంటున్న వర్కింగ్ జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అడ్ హక్ కమిటీ కో కన్వీనర్లు ముషం హరిప్రసాద్, శ్రీరాముల కృష్ణ, లింగాల సాయి గౌడ్, వంగాల వెంకన్న, నందిపాటి సైదులు, గూడపూరి ప్రభాకర్, తుంగతుర్తి మండల విలేకరులు ఎండి నజీర్, ఓరుగంటి శ్రీనివాస్, గుండగాని రామకృష్ణ , తడకమల్ల సురేష్, తడక మల్ల రమేష్, షేక్ జానీ, రమేష్, చిన్న లక్ష్మయ్య, శ్రీహరి, రహీము, ఫక్రుద్దీన్ తదితరులు

# మోత్కూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్





**ధర్మఘంట జనవరి 19 మోత్కూర్:**

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో మోత్కూరు పురపాలక సంఘంలోని 12 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. సోమవారం పట్టణభివృద్ధి కోసం మంజూరైన 15 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన గాంధీనగర్‌లో జంక్షన్, ఇందిరానగర్,పద్మశాలి కాలనీ, సుందరయ్య కాలనీల్లో సిసి రోడ్ల నిర్మాణం,పాటిమట్ల రోడ్డు నుండి జటాంగి బావి వరకు బీటీ రోడ్డు వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం స్థానిక ఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘా లకు వడ్డీలేని రుణాలు,ఇందిరా మహిళా శక్తి చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వార్డులన్నింటిలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మోత్కూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.ప్రభుత్వ నిధులు, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి చేరాలంటే కాంగ్రెస్ విజయం అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల, వెంకటేశ్వర్లు, పిఏసిఎస్ చైర్మన్ పేలపురి వెంకటేశ్వర్లు,పైళ్ల సోమిరెడ్డి, స్థానిక తహసిల్దార్ పి.జ్యోతి,ఎంపీడీవో బాలాజీ, మున్సిపల్ కమిషనర్ కె.సతీష్ కుమార్,డిఈ మనోహర, మేనేజర్ ప్రభాకర్, డిఎంసి రమేష్ బాబు,పబ్లిక్ హెల్త్ ఏఈ సురేష్, మున్సిపల్ ఏఈ సురేష్, ఆర్.పి.లు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్నేని యువసేన సేవా కార్యక్రమాలు అభినందనీయం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ధర్మ ఘంట,కోదాడ జనవరి19:-**

కోదాడ పట్టణం లో ఎర్నేని యువసేన సేవా కార్యక్రమాలు అభినందనీయం అని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎర్నేని యువసేన ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలండర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. కోదాడ నియోజక వర్గం లో సీనియర్ కాంగ్రెస్ నాయకునిగా, మాజీ సర్పంచ్ గా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గా యువత అభిమానం పొంది యువత చే సామాజిక సేవా కార్యక్రమాలు.యువ సేన కేలండర్ తో పాటు నూతన సంవత్సరం లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏర్నేని బాబు కుసుమ, ఎర్నేని నిర్మల, రావెళ్ల కృష్ణారావు, మాజీ కౌన్సిలర్ కాజా, మైలర్ శెట్టి భాస్కర్, మునగాల కాంగ్రెస్ నాయకులు నల్లపాటి శ్రీను, మాజీ కౌన్సిలర్ కోటిరెడ్డి, లైటింగ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## బీ సీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

**యునైటెడ్ కింగ్డమ్ లో అధ్యక్షుడికి ఘన సన్మానం**



**నల్గొండ జనవరి 19 ( ధర్మ గంట):**

బీసీ రిజర్వేషన్ల కోసం కొనసాగుతున్న ఉద్యమానికి సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నామని ఎన్ఆర్ఐలు పిలుపునిచ్చారు. తెలంగాణ ఆర్గనైజేషన్, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) కి చెందిన బీసీ లు ఎన్నారై బీసీ సెల్ అధ్యక్షుడు దూదిగామ కిరణ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి అభినందించి,ఘనంగా సన్మానించారు,బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా బీసీ సెల్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ర్యాగ కృష్ణయ్య నాయకత్వంలో మనం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి బీసీల రాజ్యాధికారం కోసం, బీసీల రిజర్వేషన్స్ కోసం కలిసికట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కుడుదుల,ఇతర ఎన్నారై బీసీలు వేణు కలకోట, నాగరాజు తౌటం,రాకేష్ పటేల్,రవి,ప్రదీప్ పులుసు, మధుసూధన్ గౌడ్ గోపుల్ల, సునిల్ కొక్కొండ,హరి గౌడ్, శ్రీకాంత్ జెల్ల,గణేష్ కుప్పల, అశోక్ గౌడ్ దుసారి,గణేష్ పాస్తం,సురేష్ బుడగం,ప్రవీణ్, ప్రశాంత్, రంజిత్,మహీందర్ తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులకు బీ ఫారమ్ ఇవ్వాలి

**మోత్కూర్ బీసీ సంఘం డిమాండ్**

**అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన**



**ధర్మఘంట జనవరి 19 మోత్కూరు:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి,ఉన్న రిజర్వేషన్‌లను తగ్గించడం ద్వారా బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేసిందని మోత్కూర్ బీసీ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు విస్మరించడం ప్రభుత్వ విధానమైందన్నారు.న్యాయం చేయాల్సిన ప్రభుత్వం,రాజకీయ ప్రయోజనాల కోసం మా హక్కులను మాకు అందకుండా నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు.ఈ వైఖరిని బీసీలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరన్నారు.రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో జనరల్ సీట్లలో బీసీలు స్వయంగా పోటీ చేసి విజయం సాధిస్తారని, ప్రభుత్వానికి బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులకు బీ ఫారమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కలిమెలా నరసయ్య,జంగ శీను,బయ్యని పిచ్చయ్య,ఎడ్ల నరేష్, పొన్నెబోయిన రమేష్,పోచం సోమయ్య,గజ్జి మల్లేష్, తిరుమలేష్,ఆనందాస్, విద్యాసాగర్,మొరిగాల శీను, అన్నపు సత్యనారాయణ, ప్రభాకర్,టైలర్ శీను,బుర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు




**ధర్మఘంట జనవరి 19 సూర్యాపేట**

విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో గల జయా స్కూల్‌లో అరైవ్–అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల కలిగే ప్రయోజనాలు క్షేమం గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చున్నారు.చిన్నతనం నుంచే విద్యార్థులు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని,తమ తల్లిదండ్రులకు కూడా హెల్మెట్,సీట్ బెల్ట్ ప్రాధాన్యతను వివరించాలని సూచించారు.ట్రాఫిక్ పోలీసులు నిబంధనల పట్ల అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు సీఐ మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం,ఎస్ఐలు శివతేజ,వెంకన్న,పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు,ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారులు ప్రతి పాఠశాలను సందర్శించాలి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ధర్మఘంట జనవరి 19 కరీంనగర్:**

ప్రత్యేక అధికారులు జిల్లాలోని ప్రతి పాఠశాలను సందర్శించి,అక్కడి మౌలిక వసతులు సహా పలు అంశాలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమానంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఆఖరులోపు జిల్లాలోని ప్రతి పాఠశాలను ప్రత్యేక అధికారులు సందర్శించాలని ఆదేశించారు. పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక తరగతులు,ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు,విటమిన్ గార్డెన్ నిర్వహణ,ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు,నిర్వహణ తదితర అంశాలపై నివేదిక సమర్పించాలన్నారు.ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు వినియోగిస్తున్నది లేనిది పరిశీలించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశించారు. టాయిలెట్,తాగునీరు తదితర మౌలిక వసతులను పరిశీలించి, ఏవైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.జల్ సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వర్షపు నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు ఎక్కడెక్కడ జరిగాయో వాటికి సంబంధించిన ఫోటోలను జిపిఎస్ ద్వారా నిర్దిష్ట వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేయాలని,నిర్దిష్టమైన పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.విటమిన్ గార్డెన్ల నిర్వహణ,సాయంకాలం తరగతులను ప్రత్యేక అధికారులు పరిశీలించాలన్నారు.ప్రతి పాఠశాలలో ఐదు క్లబ్బులు ఏర్పాటు చేశామని,వాటి పనితీరును తెలుసుకోవాలన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్,రమేష్ బాబు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

### పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**ధర్మఘంట జనవరి 19 మునగాల**

సూర్యాపేట జిల్లా మునగాల మండలం సీతానగరం గ్రామపంచాయతీ పరిధిలోని సీతానగరం తండా నుండి సుమారు 50 మంది వివిధ పార్టీల నుండి సోమవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే బోల్లం మల్లయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు.ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన రైతు బంధు,రైతు బీమా వంటి పథకాలను కొనసాగిస్తలేదని, కాంగ్రెస్ పార్టీకి ప్రజా సమస్యల పరిష్కారం కంటే వారికొచ్చే కమీషన్ల మీదనే ఎక్కువగా దృష్టిపెడుతున్నారని పేర్కొన్నారు.గతంలో ఈ ప్రాంతంలో బీడు భూములు ఎక్కువగా కనిపించేవని,కానీ, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చి సస్యశ్యామలం చేశారని, మళ్ళీ ఇప్పుడు కాంగ్రెస్ పాలన రాగానే మళ్లీ పాత రోజులే కనిపిస్తున్నాయని తెలిపారు. అందుకే పాలన చేసే వారికి ప్రజల పట్ల ప్రేమ ఉండాలని, కేసీఆర్ కి అలాంటి ప్రేమ ఉంది కాబట్టే ఎవరు అడగకున్నా ప్రజలకు అవసరమయ్యే ప్రతిపని చేశారని గుర్తు చేశారు. కానీ,ప్రస్తుత ముఖ్యమంత్రికి అలాంటి పట్టింపులు లేవని, అందుకే రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇలా తయారయ్యిందన్నారు.రాష్టానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అభివృద్ధికి నోచుకొని హిందూ స్మశానవాటికలు

**గోదావరిఖని,రామగుండం స్మశాన వాటికల్లో దుర్భర పరిస్థితి**

**నిత్యం ఇబ్బందులు పడుతున్న మృతుల కుటుంబాలు**

**కనీస వసతులు కల్పించడంతో పాలకులు విఫలం**

**ప్రభుత్వాల మార్పులు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చలేదు**

**స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకొని చర్యలు చేపట్టాలి**

**స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ మరియు చైర్మన్ డా.సురభి శ్రీధర్**





**ధర్మఘంట జనవరి 19 రామగుండం:** సమాజంలో స్మశాన వాటికలు సున్నితమైన, గౌరవప్రదమైన స్థలాలని, పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇక్కడి పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని,ఇలాంటి సమస్యలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నప్పటికీ, గోదావరిఖని,రామగుండం ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని,గోదావరి నదీ తీర ప్రాంతంలోని గోదావరిఖని,రామగుండం హిందూ స్మశాన వాటికలు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడంతో అంతిమ యాత్రకు వచ్చే కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ (విఎస్ఎస్ఎస్) ఫౌండర్ మరియు చైర్మన్ డా.సురభి శ్రీధర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ధర్మాఘంట ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలోనూ,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ హిందూ స్మశానవాటికల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వాలు మారినా స్మశాన వాటికల సౌకర్యాల్లో ఎలాంటి మార్పు లేదని,"పేరుకే కార్పొరేషన్ అభివృద్ధిలో మాత్రం శూన్యం" అంటూ తీవ్రంగా మండిపడ్డారు.ఈ స్మశాన వాటికల్లో సరైన రోడ్లు లేకపోవడం,రోడ్డు మార్గంలో కంకర రాళ్లు వేయడం వల్ల చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు చెప్పులు లేకుండా నడవాల్సి రావడంతో గాయాలవుతున్నాయని,విద్యుత్,తాగునీరు సౌకర్యాలు పూర్తిగా లేకపోవడం, చెత్తాచెదారంతో నిండిపోవడంతో,మౌలిక సదుపాయాల కొరతతో 11 రోజుల పాటు నిర్వహించే అంతిమ కార్యక్రమాలకు వచ్చేవారికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని,దహన సంస్కారాల సమయంలో కూడా అవస్థలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులను తక్షణమే స్పందించి ఈ స్మశాన వాటికల్లో మహిళలు,పురుషులకు వేర్వేరుగా స్నానపు గదులు (బాత్‌రూములు) ఏర్పాటు చేసి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని,సీసీ కెమెరాల ఏర్పాటు చేసి భద్రతా సిబ్బంది నియామకం చేయాలని, తాగునీరు,టాయిలెట్లు,ఎల్ఈడీ లైట్లు వంటి మౌలిక వసతులు కల్పించి,స్మశాన వాటికలో శుభ్రత పాటించడం,చెత్త సేకరణ చేయడం,ఆవరణలో పూల మొక్కలు పెంచడం,దహన సంస్కారాల కోసం ఉచితంగా కట్టెలు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

**ఇప్పటివరకు 265 కోట్ల మంది ఉచిత బస్సులో ప్రయాణం**


**పెట్రోల్ పంపు ల తోపాటు రైస్ మిల్లులు ఏర్పాటు**

**11.38 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు చెక్కుల పంపిణీ**

**పేదవారికి సన్న బియ్యంతో పాటు ఉచిత విద్యుత్**

**రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**




**నల్గొండ జనవరి 19 ( ధర్మ గంట ):** కోటి మంది మహిళలను కోటేశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.సోమవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు 11.38 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు చెక్కులను అందజేశారు.అంతేకాక ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రవేశపెట్టిందని, ఇప్పటివరకు 265 కోట్ల మంది ఉచిత బస్సులో ప్రయాణం చేసినట్లు చెప్పారు.సమాజంలో పేద వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు, సన్న బియ్యం ఇస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని తెలిపారు.నల్గొండ సమీపంలోని ఎస్ఎల్బీసీ వద్ద 5 కోట్ల రూపాయలతో రెండు ఎకరాల విస్తీర్ణంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేశామని, రెండు నెలల్లో ఇది పూర్తవుతుందన్నారు.ప్రతి నియోజకవర్గంలో మహిళలతో పెట్రోల్ పంపు ఏర్పాటు చేస్తుండగా ప్రభుత్వమే స్థలం ,రుణాలు మంజూరు చేసి రైస్ మిల్లులు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు.వచ్చే సంవత్సరంలోపు ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇన్లు ఇస్తామని, ఇంకా ఎవరైనా స్థలం కలిగి ఉంటే తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.పిల్లలను బాగా చదివించుకోవాలని,చిన్న వయసులో పెళ్లిళ్లు చేయవద్దని, ఎవరైనా ఆర్థిక స్తోమత లేక పెద్ద పెద్ద చదువులు చదివించలేకపోతే తనను సంప్రదిస్తే సహకారం అందిస్తానని తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా బొట్టుగూడా పాఠశాలను 13 కోట్ల రూపాయలతో ప్రైవేట్ పాఠశాలలకు మించి అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నామని,త్వరలోనే ప్రారంభోత్సవం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.ఐటిపాములలో 50 లక్షల రూపాయలు వెచ్చించి 50 మంది మహిళలకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయించామని, దాని ద్వారా వారు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. మహిళలును కోటీశ్వరులను చేసే వరకు వారి వెంటే ఉంటామని మంత్రి వెల్లడించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు తోపాటు ,వారి అభ్యున్నతికి కుటుంబాల తోడ్పాటుకు అనేక కార్యక్రమాల అమలు చేస్తున్నదని తెలిపారు.ఆర్థికంగా వారు నిలదొక్కునేందుకు వడ్డీ లేని రుణాలను ఇస్తున్నదని, ఇది మంచి అవకాశం అని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2023- 2024 -25 ఆర్థిక సంవత్సరంలో 2872 స్వయం సహాయక సంఘాల మహిళలకు 11.38 కోట్ల రూపాయలు చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నల్గొండ పట్టణంలో సుమారు 5 కోట్ల రూపాయలను స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు చెల్లిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.నాలుగు మున్సిపాలిటీలలో ఇందిరమ్మ చీరల పంపిణీ సైతం చేపట్టడం జరిగిందని,సోమ,మంగళవారం వరకు వీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే స్వయం సహాయక మహిళా సంఘాలకు లక్ష్యాన్ని మించి 165 శాతం బ్యాంక్ రుణాలు అందించడం జరిగిందని ఆయన వెల్లడించారు.ఇందిరా మహిళా చీరల పంపిణీలో భాగంగా నల్గొండ పట్టణంలో 20 వేల చీరలు పంపిణీ చేయనున్నారు.స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి మాట్లాడారు. కాగా పట్టణ స్థాయి స్లం ఫెడరేషన్ అధ్యక్షురాలు జయమ్మ, లావణ్యలు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,మెప్మా పీడీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్ ,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాన్ పహాడ్ దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

**మంత్రి ఉత్తమ్ మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు**

**ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు**



**ధర్మఘంట జనవరి 19 హుజూర్ నగర్:** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్ పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ.50 లక్షలు మంజూరు చేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారావు అన్నారు. సోమవారం భక్తుల సౌకర్యార్థం ఆ అభివృద్ధి నిధులతో మొదలుపెట్టిన మజీద్ చుట్టూ సీసీ రోడ్డు,దర్గా వద్ద హుజూ ఖానా,హజ్రత్ మొళి భావి వద్ద ప్రహరీ గోడ పనులను స్థానిక సర్పంచ్ భూక్యా చరణ్ సింగ్, మాజీ ఎంపిపి భూక్యా గోపాల్ నాయక్,మాజీ జడ్పీటిసి మాలోత్ మోతీలాల్ నాయక్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతోనే గతంలో కోట్ల రూపాయలు నిధులతో దర్గా వద్ద అభివృద్ధి చేశామని,ఇప్పుడు కూడా మంత్రి ఉత్తమ్ మంజూరు చేసిన అభివృద్ధి నిధులతో పనులు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు నీమానాయక్,కవితకిరణ్,సైదా నాయక్,మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మీసాల ఉపేందర్,దర్గా ముజావర్ జానీ,నాయకులు వెచ్చాల శ్రీకాంత్,భూక్యా నాగరాజు,రాము షేక్ సైదులు మల్లయ్య,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష

**బీఆర్ఎస్ పార్టీ మేయర్ గెలిస్తేనే ఈ ప్రాంత అభివృద్ధి**

**మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి**

**మెడికల్ కళాశాల తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని మెడికల్ హబ్ గా మార్చా**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**సామాజిక కార్యకర్త కటుకు స్వాతి ప్రవీణ్ సహా 200 మంది బీఆర్ఎస్ లో చేరిక**



**ధర్మఘంట జనవరి 19 రామగుండం:** తెలంగాణ ప్రజలందరికీ కెసిఆర్,బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని, రామగుండంలో బీఆర్ఎస్ పార్టీ మేయర్ గా గెలిస్తేనే ఈ ప్రాంత అభివృద్ధి జరుగుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు.సోమవారం 13 వ,డివిజన్ లో సామాజిక కార్యకర్త కటుకు స్వాతి ప్రవీణ్ తో పాటు రెండు వందల మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభయాస్తం కార్డు ఇచ్చి నెల రోజుల్లో హామిలను అమలు చేస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం,విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని అబద్ధపు హామీలను చెప్పి మోసం చేశారన్నారు.మెసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజం అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ పార్టీ, నాయకులను అభయ హస్తం బాకీ కార్డులను చూపించి హామీలు ఎందుకు నెరవేర్చలేదని నీలదీయాలన్నారు.గత రెండు సంవత్సరాలుగా రామగుండం నియోజకవర్గంలో కమీషన్లు కూల్చివేతలు మాత్రమే జరుగుతున్నాయని,అభివృద్ధి సాకుతో చిరు వ్యాపారుల దుకాణాలు కుల్చి వారిని రోడ్డున పడేసారన్నారు.తాము ఐదేళ్లు రామగుండం నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ పరిపాలన సాగించామన్నారు. దశాబ్దాల కల అయిన మెడికల్ కళాశాల రామగుండం తీసుకువచ్చి 510 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయించామని గుర్తు చేశారు. అదేవిధంగా సబ్ రిజిస్టర్ కార్యాలయం ఈ ప్రాంతానికి తీసుకు వచ్చామన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని,కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. 13వ,డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కటుకు స్వాతి ప్రవీణ్ లను ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాన్ పహాడ్ ఎత్తిపోతల పథకం విస్తరణ పనులకు పరిపాలన అనుమతి

**సవరించిన అంచనాలను ఆమోదం**

**ఐదు ఎత్తిపోతల పథకాలకు 628.78 కోట్ల విడుదలకు ప్రభుత్వం ఆమోదం**

**లక్షా 58 వేల 300 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు**

**నియోజకవర్గ రైతాంగం కల సాకారం**

**మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ధర్మఘంట జనవరి 19 హైదరాబాద్:** సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకవీడు మండలం జాన్ పహాడ్ గ్రామంలోని జవహర్ జాన్ పహాడ్ ఎత్తిపోతల పథకాల విస్తరణ పనులకు పరిపాలనా పరమైన అనుమతులు మంజూరయ్యాయని,జాన్ పహాడ్ ఎత్తిపోతల పథకం విస్తరణతో పాటు ఆర్-9 మరమ్మతులకు,ఎన్ఎస్ఎల్బీసి లైనింగ్ తదితర పనులకు, హుజుర్ నగర్,కోదాడ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పునరుద్ధరణ పనులకు కుడా అనుమతులు మంజూరయ్యాయని,వీటన్నింటికి నీటిపారుదల శాఖ సవరించిన అంచనాలకు ఆదివారం సాయంత్రం భూపాలపల్లి జిల్లా మేడారంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదించిందని సోమవారం సాయంత్రం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు.ఐదు ప్రాజెక్టల నిర్మాణానికి గాను గతంలో 447 కోట్లతో ప్రణాళికలు రూపొందించగా కాలక్రమంలో పెరిగిన ఆయకట్టుకు అనుగుణంగా ఆ మొత్తం 628.78 కోట్లకు పెరిగిందని తెలిపారు.ఈ మొత్తం ప్రాజెక్టులు పూర్తి అయితే 1,58,300 ఎకరాలకు సమృద్ధిగా సాగు నీరు లభిస్తుందన్నారు.
నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది మొదలు సాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించి,అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి రూపొందించిన ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు లభించడం సంతృప్తినిచ్చిందన్నారు.
నియోజకవర్గ రైతాంగం కల సాకారం చెయ్యాలన్నదే నా పరితపనని,అందుకు తగ్గట్టుగానే పురోగతి సాధించడం ఆనందదాయకంగా ఉందన్నారు.వాస్తవానికి 173 కోట్ల అంచనాతో 5,650 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించబడిన జవహర్ జాన్ పహాడ్ ఎత్తిపోతల పథకానికి 2022 లో ప్రణాళికలు రూపొందించామని, అయితే ఆయకట్టును 10,000 ఎకరాలకు విస్తరించాలన్న ప్రతిపాదనలు ముందుకు రావడంతో రైతాంగం ఆకాంక్షమేరకు 173 కోట్ల అంచనా వ్యయాన్ని 292.98 కోట్లకు పెంచాల్సి వచ్చిందని తెలిపారు.ఆ పెరిగిన మొత్తానికి ఆదివారం సాయంత్రం మేడారంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదించిందన్నారు.మొదలు అనుకున్నట్లుగా జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్ 19.90 కిలోమీటర్ వద్ద నీటిని ఎత్తిపోతల ద్వారా టెయిల్ ఎండ్ ప్రాంతాల్లో సాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్న జాన్ పహాడ్ ఆలింగాపురం,బొత్తలపాలెం,కోమటికుంట,గుండ్లపహాడ్,గండెబోయినగూడెం,మీగడం పహాడ్ తండా,చెరువుతండా, రాజీహ్వాపురం గ్రామాలకు చెందిన 5,650 ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు ఆరు చిన్ననీటి పారుదల ట్యాంకులకు ప్రయోజనం జరిగేదని వివరించారు.అయితే రైతాంగం నుండి వస్తున్న అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని అదనంగా మరో 4,350 ఎకరాలు కలిపి మొత్తం పదివేల ఎకరాలకు ఈ ఎత్తిపోతల పథకం విస్తరించడంతో అంచనాలను సవరించాల్సి వచ్చిందన్నారు. అదనంగా పెరిగిన 4,350 ఎకరాల ఆయకట్టు పరిధిలో యెల్లాపురం,సజ్జాపురం,పాలకవీడు,నాగిరెడ్డిగూడెం,హనుమయ్యగూడెంలతో పాటు గుడుకుంట్లపాలెం ఉన్నాయని, వీటితో పాటు మరో 3 చిన్నతరహా నీటిపారుదల ట్యాంకులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఇప్పటికే పంప్ హౌజ్ నిర్మాణంతో పాటు ఫ్రెషర్ మెయిన్ లేవుట్ పనులు వేగవంతంగా కోనసాగుతున్నాయని,2026 ఖరీఫ్ నాటికి పూర్తి చేసేందుకు గాను యుద్ధప్రాతిపదికన పనులు సాగుతున్నాయన్నారు.
అదే విధంగా జవహర్ జాన్ పహాడ్ ఎత్తిపోతల పథకంతో పాటే పాలనా పరమైన అనుమతులు పొందిన ఎన్ఎస్పీ ఎడమ ప్రధాన కాలువపై ప్రతిపాదించిన ఆర్-9 ఎత్తిపోతల పథకం ద్వారా ప్రస్తుతం 1500 ఎకరాలు ఉండగా,అదనంగా మరో 800 ఎకరాల ఆయకట్టును కలిపి మొత్తం 2300 ఎకరాల సాగునీరు అందించేందుకుగాను అనుమతులు పొందామన్నారు. దీని ద్వారా కోదాడ నియోజకవర్గ పరిధిలోని బరాఖత్ గూడెం, కృష్ణానగర్,ఆకుపాముల లతో పాటు రామాపురం,ఇకే పేట్ తండా గ్రామాల రైతాంగానికి సమృద్ధిగా సాగునీరు లభిస్తుందన్నారు.అదే విధంగా హుజుర్ నగర్,కోదాడ నియోజకవర్గాల పరిధిలోని 1,08,000 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించ బడిన ముక్త్యాల బ్రాంచ్ ను పునరుద్ధరించడంతో పాటు ఆధునీకరణ చేసేందుకు గాను 222.22 కోట్లకు ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. వీటితో పాటే ఎన్.ఎస్.ఎల్.బి.సి మెయిన్ కెనాల్ 70.560 నుండి 115.400 కిలోమీటర్ వరకు చేపట్టిన లైనింగ్ తో పాటు ఇతర పునరుద్ధరణ పనులకు 29.02 కోట్లు,హుజుర్ నగర్ నియోజకవర్గ పరిధిలో 35,000 ఎకరాలకు ప్రయోజనం చేకూర్చనున్న జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్ లో మిగిలి పోయిన సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులకు గాను 53.68 కోట్లకు అనుమతులు లభించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# గణతంత్ర దినోత్సవ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ధర్మఘంట జనవరి 19 సూర్యాపేట:**

ఈ సంవత్సరం జనవరి 26 న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ విసి హాల్ నందు జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ ముఖ్యఅతిథి సందేశానికి శాఖల అభివృద్ధి కార్యక్రమాల నివేదికలను పంపించాలని,గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని,వివిధ శాఖల అభివృద్ధి తెలిపే విధంగా శకటాలు,స్టాల్స్ ఏర్పాటు చేయాలని,జిల్లా స్థాయి కార్యక్రమం ప్రారంభానికి ముందే మండల,గ్రామస్థాయిలో కార్యక్రమాన్ని ముగించుకొని జిల్లా స్థాయి కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, సిపిఓ కిషన్ నాయక్,డిఇఓ అశోక్,డిపిఓ యాదగిరి,ఇన్చార్జ్ డిఆర్డిఏ పిడి శిరీష,అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## ఓటమిని జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు

**మాధవరంలో బీఆర్ఎస్ వార్డు మెంబర్ గడ్డివాము దగ్ధం**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన మాజీఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



**ధర్మఘంట జనవరి19 మునగాల :** సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడవ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థిగా మున్నా లింగయ్య పోటీ చేసి ఘన విజయం సాధించడంతో పాటు, గ్రామ సర్పంచ్ స్థానం కూడా బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుందని,ఓటమిని జీర్ణించుకోలేని ప్రత్యర్దులు ఇటీవల లింగయ్య తమ పశువుల కోసం సేకరించుకున్న గడ్డివామును పెట్రోల్ పోసి దగ్ధం చేశారని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు.సోమవారం ఘటనా స్థలాన్ని సదర్శించి దగ్ధమైన గడ్డివామును పరిశీలించి,బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపొందడంతో జీర్ణించుకోలేని ప్రత్యర్థులు అప్పటి నుంచి గ్రామాలలో పలు రకాల కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని, బీఆర్ఎస్ దిమ్మలు పగులకొట్టడం,శ్రేణులపై వ్యక్తిగత దాడులు చేయడం,ఆస్తి నష్టం చేయడం లాంటి అరాచక చర్యలకు దిగుతున్నారని, ఇదంతా స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రోత్సాహంతోనే అవుతున్నాయని,దీనికి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనలలో ఇప్పటివరకు స్థానిక పోలీసులు నిందితులను గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.పోలీసులు తమ విచారణలో జాప్యం చేయడం చూస్తుంటే,అధికార పార్టీ నాయకులకు స్థానిక పోలీసులు ఎలా వత్తాసు పలుకుతున్నారో స్పష్టంగా అర్థమవుతోందన్నారు.స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అరాచకాలను ప్రోత్సహిస్తూ పోలీసులకు అండగా నిలుస్తున్నారని,అందువల్లే ఇటువంటి దాడులు పెరిగిపోతున్నాయన్నారు. నిందితులను గుర్తించినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి,గడ్డివాము దగ్ధానికి కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి,చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై మండల ప్రత్యేక అధికారులు సమీక్షించాలి

**కలెక్టర్ బి చంద్రశేఖర్.**



**నల్గొండ జనవరి 19 (ధర్మ గంట ):** ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై మండల ప్రత్యేక అధికారులు మండలాలలో సమీక్షించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ప్రత్యేక అధికారులు మండలాలలో వారి పరిధిలోని అన్ని సంక్షేమ హాస్టలను తనిఖీ చేసి ప్రతి నెల నిర్దేశించిన ప్రొఫార్మాలో వివరాలు సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ లకు ఈ నెల 19 నుండి ఫిబ్రవరి 28 వరకు 5 బ్యాచ్ లలో శిక్షణ కార్యక్రమాలను ఇవ్వడం జరుగుతున్నదని ,ఆయా శాఖల అధికారులు వారికి శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సర్పంచ్ లకు శిక్షణ కార్యక్రమాల ద్వారా తెలియజేయాలని కోరారు.ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులన్నింటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఫిర్యాదులు పెండింగ్ లో ఉంచవద్దని కోరారు. పరిష్కరించిన ఫిర్యాదులపై వెంటనే కలెక్టర్ కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగానికి సమాచారం సమర్పించాల్సిందిగా ఆదేశించారు.జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు.కాగా ఈ సోమవారం మొత్తం 82 ఫిర్యాదులు రాగా, అందులో 47 జిల్లా అధికారులకు, 35 రెవెన్యూ శాఖకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ,ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, దేవరకొండ చండూరు ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఎస్పీ పోటీ

**జిల్లా అధ్యక్షుడు రావులపాటి రవిశంకర్**



**నల్గొండ జనవరి 19( ధర్మ గంట ):** త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని జిల్లా అధ్యక్షుడు రావులపాటి రవిశంకర్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీకాంత్ సూచన మేరకు జిల్లాలోని 7 మున్సిపాలిటీలు,1కార్పొరేషన్ పరిధిలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ ఏనుగు గుర్తుపై అన్ని వార్డుల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.బీసీలకు 52 శాతం బీఎస్పీ ద్వారానే సాధ్యమని జరగబోయే ఎన్నికల్లో సమర్థులైన అభ్యర్థులను గెలిపించుకోవాలని డబ్బుకు,మద్యానికి అమ్ముకోవద్దన్నారు.ఓటు విలువైందని సమాజ మార్పు కోసం ఉపయోగించాలన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోనల్ ఇన్చార్జి కత్తుల కాన్షీరామ్,సీనియర్ నాయకులు ఎన్నికల పర్యవేక్షులు వంటపాక యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు బొట్ల శివ,పుట్టల దినేష్,చుక్కా రాములు,భాషపాక శివ,ఇటిక్యాల నవీన్,వంటపాక కిరణ్ కుమార్,మేడి వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి

**ధర్మఘంట జనవరి 19 ఖమ్మం:**
రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని ఖమ్మం రూరల్ ఏసీపి తిరుపతిరెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి,ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అరైవ్-అలైవ్' అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మం రూరల్ మండలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై పోలీస్ శాఖ దృష్టి సారించిందని,ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే,ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,అతివేగం,ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్,సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు శిక్షలతో పాటు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్-అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు.పది రోజుల ప్రణాళికతో కార్యాచరణ ఈ అవగాహన కార్యక్రమాన్ని ఒకటి రెండు రోజులకు పరిమితం చేయకుండా,పది రోజులపాటు నిరంతరంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని వివరించారు. గ్రామాలు,పట్టణాలు,మండల కేంద్రాలు,జాతీయ రహదారులు,ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పాఠశాలలు,కళాశాలలు,బస్టాండ్లు, ఆసుపత్రులు,పరిశ్రమలు,మార్కెట్ ప్రాంతాలు,దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు,ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు,యువతే మార్పుకు నాంది పలకాలని,రోడ్డు భద్రతపై యువతలో చైతన్యం వస్తే సమాజం మొత్తం మారుతుందన్న నమ్మకంతో విద్యార్థులు,యువకులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపారు. పాఠశాల,కళాశాల విద్యార్థులతో సమావేశాలు నిర్వహిస్తూ,రోడ్డు భద్రత నిబంధనలు,బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ప్రాముఖ్యతను వివరించామని చెప్పారు. భవిష్యత్తులో వాహనాలు నడిపే వారు ఈ యువత కావడంతో, ఇప్పుడే అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటూనే,అవగాహన ద్వారా మార్పు తీసుకురావాలని పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడితే జైలు శిక్ష, జరిమానాలు తప్పవని, ప్రాణాలకు విలువ కట్టలేమని ప్రజలు గ్రహించాలని ఆయన అన్నారు. 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులతో, గాయపడిన బాధితులతో నేరుగా మాట్లాడుతున్నామని తెలిపారు. వారి అనుభవాలు, బాధలు వింటే ఎవరి హృదయమైనా కదిలిపోతుందని,ఇది ప్రజల్లో ఆలోచన మార్పుకు దోహదపడుతుందని చెప్పారు. ఈ ప్రత్యక్ష సంభాషణల ద్వారా ప్రజల్లో బాధ్యతాభావం పెరుగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే విజయం లభిస్తుందని,ఈ కార్యక్రమంలో పోలీసులు మాత్రమే కాకుండా మహిళా సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, డ్రైవర్లు,రైతులు,వ్యాపారులు, మత పెద్దలు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అందరూ భాగస్వాములుగా ఉండాలని కోరారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని,సమాజం మొత్తంగా ముందుకు వస్తేనే ప్రమాదాలను తగ్గించగలమన్నారు. 'అరైవ్- అలైవ్' ఒక ఉద్యమంగా మారాలని,ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక అవగాహన కార్యక్రమంగా కాకుండా,ప్రజా ఉద్యమంగా మార్చాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరులను కూడా ప్రోత్సహిస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు.



## రాష్ట్రస్థాయి కార్టూన్ల ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్



**ధర్మఘంట జనవరి 19 కరీంనగర్:**
తెలంగాణ కార్టూనిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వర డిగ్రీ,పీజీ కళాశాలలో రాష్ట్రస్థాయి కార్టూన్ల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ప్రారంభించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల తెలుగు విభాగం సహకారంతో సోమ, మంగళవారాల్లో ఈ కార్టూన్ల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలలకు చెందిన వివిధ కార్టూనిస్టుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని, ఆలోచింపజేస్తున్నాయన్నారు. యువతను కార్టూనిస్టులుగా ప్రోత్సహించాలని,జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కార్టూనిస్టులు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్టూనిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్,ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి,రిప్రెజెంటివ్ పర్సన్ కళ్యాణం శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ,తెలుగు విభాగం అధ్యాపకులు, కార్టూనిస్టులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు సోదరులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**ధర్మఘంట జనవరి 19 రామగుండం:**
ఎన్టీపీసీ నర్రశాల పల్లికి చెందిన జర్నలిస్టు మామిడి కుమారస్వామి,సత్యనారాయణను రామగుండం మాజీ ఎమ్మెల్యే,పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ సోమవారం పరామర్శించారు. వారి తండ్రి మామిడి రాయలింగు ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంటనే బీఆర్ఎస్ పార్టీ,నాయకులు నారాదాసు మారుతీ,పర్లపల్లి రవి తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి సిపిఐ అభ్యర్థులను గెలిపించాలి

**జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**




**ధర్మఘంట జనవరి 19 మోత్కూర్:** మోత్కూరు మున్సిపాలిటీలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలంటే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని, సిపిఐ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం మోత్కూరు కేఆర్ భవన్‌లో చాపల అంజయ్య అధ్యక్షతన జరిగిన సిపిఐ మున్సిపాలిటీ పరిధి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,నిత్యం ప్రజల సమస్యలను అజెండాగా పెట్టుకుని పోరాడే పార్టీ సిపిఐ అని,మోత్కూరు మున్సిపాలిటీలో డ్రైనేజీ సమస్యలు,వీధివెలుగులు,రోడ్ల మరమ్మతులు వంటి ప్రాథమిక సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి పరిష్కారం కోసం పాటుపడుతున్న పార్టీ సిపిఐ అని గుర్తుచేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బలమున్న వార్డుల్లో సిపిఐ పార్టీ పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని,ప్రజలు అభివృద్ధి కోరుకుంటే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్,బుజిలాపురం గ్రామ కార్యదర్శి చేతరాశి సత్తయ్య,ఏవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుల శేఖర్ రెడ్డి,కొండగడప గ్రామ కార్యదర్శి తొంట తిరుపయ్య,మోత్కూరు పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య,చేనేత సంఘం జిల్లా కార్యదర్శి పోచం కన్నయ్య,బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పెండెం వెంకటేశ్వర్లు, గీతపనివారుల సంఘం మండల అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్,రైతు సంఘం మండల అధ్యక్షుడు మొగుళ్ల తిరుపతి రెడ్డి,సీనియర్ నాయకుడు తాడూరు లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## జనసేన గూటికి సుచరిత

**గుంటూరు**

ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఆ పార్టీలో ఉన్న చాలామంది నేతలు కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇటీవల ఆ చేరికలు తగ్గుముఖం పట్టాయి. అయితే సంక్రాంతి తర్వాత చాలామంది వైసిపి నేతలు పార్టీకి గుడ్ బై చెబుతారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని మహిళా నేతలకు ప్రాధాన్యత తగ్గినట్లు వార్తలు వస్తున్నాయి. అందుకే వారు పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు టాక్ నడుస్తోంది. ముఖ్యంగా గుంటూరు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి పార్టీకి రాజీనామా చేస్తారని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఆవిర్భావం నుంచి జగన్ వెంట అడుగులు వేస్తున్న చాలామంది నేతలు ఉన్నారు. అటువంటి వారిలో గుంటూరు జిల్లాకు చెందిన మేకతోటి సుచరిత ఒకరు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆమెకు ఎంతగానో ప్రోత్సాహం అందించారు. జడ్పిటిసి సభ్యురాలిగా అవకాశం ఇచ్చారు. 2009లో ఆమె తొలిసారిగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతోనే అసెంబ్లీలో అడుగు పెట్టారు. అందుకే ఆయన అకాల మరణంతో కుమారుడు జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. అయితే ఉప ఎన్నికల్లో మరోసారి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో మూడోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచేసరికి జగన్మోహన్ రెడ్డి తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2024 ఎన్నికల్లో నాలుగో సారి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు మేకతోటి సుచరిత
కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు సుచరిత మొన్నటి ఎన్నికల్లో ప్రత్తిపాడు బదులు తాడికొండ నుంచి పోటీ చేశారు. అది ఎంత మాత్రం ఆమెకు అంగీకారం కాదు. ఎందుకంటే 2009 నుంచి ఆమె ప్రత్తిపాడు నుంచి పోటీ చేస్తూ వచ్చారు. 2019లో అదే నియోజకవర్గంలో నుంచి గెలిచేసరికి జగన్ మంత్రివర్గంలో హోం మంత్రి పదవి అందుకున్నారు. కానీ విస్తరణలో భాగంగా రెండునర ఏళ్ళకే మంత్రి పదవి పోగొట్టుకున్నారు. అయితే తనను మంత్రివర్గం నుంచి తొలగించడం పై అసంతృప్తికి గురయ్యారు. పార్టీకి దూరమవుతారని కూడా ప్రచారం నడిచింది. అయినా సరే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆమెను ప్రత్తిపాడు నుంచి తాడికొండ కు మార్చారు. అప్పట్లో కూడా ఆమె అసంతృప్తికి గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే గత 19 నెలల కాలంలో ఆమె యాక్టివ్ గా మారింది తక్కువ. అయితే వైసీపీలో ఉంటే తనకు రాజకీయ భవిష్యత్తు లేదని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే జనసేనలో చేరేందుకు ఆమె సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. సంక్రాంతి తర్వాత ఆమె జనసేన లో చేరడం ఖాయమని టాక్ నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## టీడీపీలో ఏం జరుగుతోంది...

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ ఆయన శ్రమను ప్రజలు గుర్తిస్తున్నారు కానీ ఎమ్మెల్యేలు మాత్రం గుర్తించడం లేదు. ఎక్కువ మంది శాసనసభ్యులు తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారి వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు నిజంగా దోపిడీకి దిగుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ప్రధాన మీడియా ద్వారా వచ్చే విమర్శలు.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వస్తున్నాయి. ఇటీవల మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదిక మేరకు దాదాపు 48 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని స్పష్టం చేసింది. అయితే వారిని చంద్రబాబు హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే పనితీరు మాత్రం గాడిన పడలేదన్నది వాస్తవం. ఎందుకంటే ప్రతి పనికీ పర్సంటేజీలు. ప్రతి కార్యక్రమంలో అవినీతి. సొంత పార్టీ నేతలను కూడా వారు వదలకుండా దోపిడీకి తెరతీస్తున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల, లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఎమ్మెల్యేలు కొందరు నిర్భీతిగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం పార్టీలోనే జరుగుతుంది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య తలెత్తిన వివాదంలోనూ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొలికపూడి శ్రీనివాసరావు ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయినా సరే ఆయనను పిలిచి మందలించిన సందర్భం లేదు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్ ప్రసాద్ విషయంలో కానీ, ఉత్తరాంధ్ర జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు. అయినా పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుతో పార్టీ బాగా డ్యామేజీ అయింది. ఇక రానున్న కాలంలో ఇలాంటి మెతక వైఖరిని అవలంబిస్తే మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ కి నష్టం తప్పదన్న సంకేతాలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి.

## కోట్ల ఫ్యామిలీ దూరమేనా

**కర్నూలు**

టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. పార్టీ అధినాయకత్వాన్ని కలిసే ప్రయత్నం కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చేయడం లేదట. దీంతో డోన్ నియోజకవర్గంలో మాత్రమే కాదు కర్నూలు జిల్లాలో కోట్ల మౌనంపై అనేక ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు వరకూ యాక్టివ్ గా తిరిగిన ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత మాత్రం పూర్తిగా నిరాశలో మునిగిపోయారు. కర్నూలు జిల్లాలో కోట్ల కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అదే సమయంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ఒక వెలుగు వెలిగారు.
..2024 ఎన్నికలకు ముందు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తన కుటుంబంతో కలసి టీడీపీలో చేరారు. తన తండ్రి సుదీర్ఘకాలం కొనసాగిన కాంగ్రెస్ పార్టీని వదిలేసి ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర విభజనకు కారణమైన కాంగ్రెస్ కు రాష్ట్రంలో పుట్టగతులు లేవని భావించిన ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారని అంటారు. వైసీపీలోకి వెళ్లడం ఇష్టంలేక టీడీపీలోకివచ్చారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి రాకతో కర్నూలు జిల్లాలో టీడీపీకి అదనపు బలం చేకూరినట్లయింది. అయితే దే సమయంలో తనకు శత్రువుగా భావించే కేఈ కృష్ణమూర్తి కూడా రాజకీయంగా రిటైర్ అయ్యారు. కానీ కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాత్రం ఎమ్మెల్యే సీటును అయిష్టంగానే తీసుకున్నారు. గెలిచిన తర్వాత మంత్రి పదవి వస్తుందని ఆశిస్తే, తన రాజకీయ అనుభవమంత వయస్సు లేని టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి మంత్రి కావడం ఆయనను కుదురునివ్వకుండా చేస్తుందంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి తాను కూడా రాజకీయంగా వైదొలగాలని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి నిర్ణయించుకున్నట్లు సమాచారం. అవసరమైతే తన సతీమణిని రాజకీయాల్లో కొనసాగించాలని, తాను మాత్రం రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితుల వద్ద పదే పదే ప్రస్తావిస్తున్నారట. తాను ఇక ఏ ఎన్నికల్లో పోటీ చేయబోనని కుటుంబంలోని ముఖ్యులతో పాటు సన్నిహితులకు కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చెబుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం డోన్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నా అక్కడికే పరిమితమయిన కోట్ల ఇక రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదంటున్నారు. రాజకీయాలు ఇక తనకు పనికి రావని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి సన్నిహితుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. మరి కోట్ల నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.

## పాపం... శీనన్న

**విశాఖపట్టణం**

విశాఖకు చెందిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఎక్కడ ఉన్నారన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఆయన వైసీపీకి రాజీనామా చేసి ప్రస్తుతం తన వ్యాపారాలను చూసుకుంటున్నారని మాత్రం చెబుతున్నారు. రాజకీయాలకు మాత్రం దూరంగా ఉంటున్నారు. రాజకీయాల్లోకి వేగంగా దూసుకు వచ్చి పార్లమెంటు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన అవంతి శ్రీనివాస్ అంతే స్పీడ్ తో రాజకీయాల నుంచి బ్రేక్ ఇవ్వడంపై చర్చ జరుగుతంది. వైసీపీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ప్రస్తుతం రాజకీయంగా ఖాళీగానే ఉన్నారు. ఆయన తన విద్యాసంస్థలను చూసుకోవడానికే పరిమితయ్యారు. అయితే ఆయన వైసీపీకి రాజీనామా చేసి నెలలు గడుస్తున్నా ఏ పార్టీలో చేరలేదు. ఆయన పార్టీలో చేరాలనుకున్నప్పటికీ ఇప్పటికే విశాఖ ప్రాంతంలో అధికార పార్టీలో నేతలు ఎక్కువ కావడంతో పాటు ఆయనను చేర్చుకుంటే లేనిపోని తలనొప్పులు వస్తాయని భావించి ఏ పార్టీ కూడా ఆయనను దరిచేరనివ్వకపోవడంతోనే సమయం కోసం వెయిట్ చేస్తున్నారంటున్నారు.